J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 03.04.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 44 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



## లాక్‌డౌన్‌కు బ్రేక్‌డౌన్

- 130 కోట్ల ప్రజల శ్రమను నీరుగార్చిన నిజాముద్దీన్ మత సదస్సు
- కరోనా వైరస్ విజయానికి అడ్డుకట్ట వేసిన నిర్లక్ష్య వైఖరి
- ఢిల్లీ ఘటనతో దేశ వ్యాప్తంగా అనూహ్యంగా పెరిగిన కేసులు
- దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాలలో ప్రమాద ఘంటికలు

*ప్రపంచంలోని 200కు పైగా దేశాలు కరోనా మహమ్మారిపై మూకుమ్మడి యుద్ధం చేస్తున్న వేళ... కరోనా వైరస్ ధాటికి అమెరికా, ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలే గజగజ వణుకుతున్న సమయాన... రోజురోజుకు వేలల్లో మృతులు, లక్షల్లో వైరస్ బాధితులు పెరుగుతున్న తరుణాన... 130 కోట్ల జనాభా... ఎన్నో జాతులు, ఎన్నో కులాలు, మతాలకు నిలయమైన భారతదేశం కరోనా వైరస్‌పై 'లాక్‌డౌన్' అస్త్రంతో యుద్ధం సాగిస్తూ... ఇక విజయం సాధించడం ఖాయమనుకున్న తరుణంలో వూహించని ఉత్పాతానికి ఓ మత సదస్సు వేదికగా మారింది. దేశ వ్యాప్తంగా కరోనా వైరస్ ఉత్పత్తికి ఆ సదస్సు మూలాధారమైంది. ఆ సదస్సు మూలంగా కరోనా వైరస్‌ను నిరోధించేందుకు భారత ప్రభుత్వం అత్యంత కఠినంగా అమలు చేస్తున్న లాక్‌డౌన్‌కు బ్రేక్‌డౌన్ అయ్యింది.*

(మిగతా 11వ పేజీలో)




## ప్రమాదం అంచున ప్రపంచం

### ఆగని మృత్యుఘోష

11లో

## నెల్లూరు గుండె గుభేల్!



### మొత్తం 21 పాజిటివ్ కేసులు

- గురువారం ఒక్కరోజే 18
- నగరంలో 10 కొత్త కేసులు
- రంగనాయకులపేట, కోటమిట్ట, జనార్ధన్‌రెడ్డి కాలని, కొత్తూరులలో ఆందోళన
- నాయుడుపేటలో 4 కేసులతో అలజడి
- భయం గుప్పిట్లో జిల్లా జనం

*ఢిల్లీ నిజాముద్దీన్ మర్కత్ సెగ నెల్లూరుజిల్లాను కూడా తాకింది. ఆ సదస్సుకు నెల్లూరుజిల్లా నుండి వెళ్లి వచ్చిన వారి మూలంగా కొత్తగా కరోనా పాజిటివ్ కేసులు బయటపడుతున్నాయి.*

మార్చి 31వ తేదీ వరకు నెల్లూరుజిల్లాలో ఒకే ఒక్క కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడం జరిగింది. రాష్ట్రంలోనే ఇది తొలి కేసు. ఇటలీ నుండి వచ్చిన యువకుడికి సోకింది. నెల్లూరు పెద్దాసుపత్రిలో అందించిన చికిత్స ద్వారా ఆ యువకుడు కోలుకుని డిశ్చార్జ్ కూడా అయ్యాడు. ఇక జిల్లాలో కరోనా కేసులు లేవు... అంతా హ్యాపీ అనుకుంటున్న సమయంలో ఢిల్లీ బాంబు పేలింది.

నిజాముద్దీన్ మర్కత్‌కు జిల్లాలోని ఆయా మండలాల నుండి 68మంది వెళ్లినట్లుగా తేలింది. దీంతో అధికార యంత్రాంగమంతా వారి వేటకు కదిలింది. వారిని, వారి బంధువులను, వారితో సన్నిహితంగా వున్నవారిని గుర్తించి 253 మందిని తీసుకొచ్చి నెల్లూరులోని కరోనా రీజనల్ ఏరియా ఆసుపత్రిలో వుంచారు. వీరిలో 40 మందికి పరీక్షలు కరోనా పరీక్షలు నిర్వహించగా

(మిగతా 11వ పేజీలో)



## తెలుగు రాష్ట్రాల గుండెలపై ఢిల్లీ కుంపటి

- అనూహ్యంగా పెరిగిన కరోనా కేసులు
- రెండు రాష్ట్రాలలో ఆందోళన

*కరోనా వైరస్‌ను కాలితో తంతా.. తెలంగాణలో లేకుండా చేస్తా... ఇంకెంత... గట్టిగా వారం కళ్లు మూసుకుంటే ఈ కరోనా పీడ పోతుంది... మన పనులు మనం చేసుకో వచ్చంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్....*

*రాష్ట్రంలో మా వాలంటీర్ల వ్యవస్థ బాగా పని చేస్తుంది... వాలంటీర్లు ఇల్లిల్లు జల్లెడ పడుతున్నారు. విదేశాల నుండి వచ్చినవారిని ఇంటి గడప దాటి బయటకు రాకుండా చేస్తున్నారు. కాబట్టి రాష్ట్రంలో కేసులు పెరగడం లేదంటూ ఏపి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి...*

ఈ ఇద్దరు సీఎంల ఆత్మవిశ్వాసాన్ని వమ్ము చేసింది నిజాముద్దీన్ మర్కత్ మత సదస్సు. ఈ సదస్సులకు రెండు తెలుగురాష్ట్రాల నుండి రెండు వేల మందికి పైగానే నిజాముద్దీన్ సదస్సులకు వెళ్లారు. ఈ రెండు రాష్ట్రాలలోని అన్ని మండలాల వాళ్ళు కూడా వీరిలో వున్నారు.

విదేశాల నుండి వచ్చిన వారి మూలంగా వైరస్ కేసులు తక్కువుగానే నమోదయ్యాయని ఆనంద పడుతున్న తరుణంలో ఉరుములేని పిడుగులా నిజాముద్దీన్ సంఘటన బయటపడింది. ఈ రెండు తెలుగు రాష్ట్రాలలో కొత్తగా పెరుగుతున్న కరోనా పాజిటివ్ కేసులన్నీ కూడా నిజాముద్దీన్‌తో లింక్ వున్నవే కావడం గమనార్హం.

(మిగతా 11వ పేజీలో)

# ఇది మనందరికీ పరీక్షా సమయం



**- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి**

ప్రపంచమంతా గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారి మనందరికీ పరీక్షను పెట్టేందుకే దాపురించిందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఆయన పేర్కొన్నారు. కరోనా వైరస్ మహమ్మారి మనలోని నిగ్రహం, సంకల్ప బలాన్ని పరీక్షిస్తుంది. మనిషి ఇటువంటి మహమ్మారుల ముందు ఎప్పుడూ ఓడిపోడు. కొన్ని శతాబ్దాలుగా ఇటువంటి సవాళ్ళను ఎన్నో దాటుకుంటూ వచ్చాం. ఇప్పుడు కరోనా వైరస్ వంతు వచ్చింది. మనమంతా సమైక్యంగా ఎదుర్కొనే సమయం ఇది. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపుమేరకు మనమంతా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని ముఖ్యమంత్రి ముందుగానే అందిస్తున్నారని, రాష్ట్ర ప్రజలకు మున్ముందు కూడా రక్షణగా తానున్నానని భరోసా కల్పిస్తున్నారని ఆదాల తెలిపారు. మనవంతుగా మనం పరిశుభ్రతను పాటించి వైరస్ మహమ్మారిని తరిమేద్దామని, పరిశుభ్రతను పాటించడం, సామాజిక దూరాన్ని పాటించడం వంటి చర్యల ద్వారా మనం మన కుటుంబాన్ని, సమాజాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఇటువంటి ఉత్పాతాలు మన ముందు నిలువలేవని నిరూపిద్దామని, మనమందరం ఏప్రిల్ 14వ తేదీ వరకు నిగ్రహంగా ఇళ్లలోనే ఉండి కరోనాపై విజయం మనదేనని నిరూపిద్దామని ఆదాల పిలుపునిచ్చారు.

### ఆదాల వితరణ కోటి 20 లక్షలు

కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి సాయంగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన ఎంపి నిధుల నుంచి కోటి రూపాయలు ప్రకటించారు. అంతేకాక, తన సొంత నిధుల నుంచి 20 లక్షల రూపాయలను చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు. ఆ చెక్కును ఈనెల 1న విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మంత్రి అనిల్‌కుమార్ చేతులమీదుగా జిల్లా జాయింట్‌కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌తో పాటు వైకాపా నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, స్వర్ణ వెంకయ్య, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రులు సహకరించాలి



**- మంత్రి అనిల్**

నెల్లూరుజిల్లాలో కరోనా నివారణకు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు సహకరించాలని రాష్ట్ర మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈనెల 1న జడ్పీ సమావేశ మందిరంలో ప్రైవేట్ వైద్యులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా నియంత్రణకు వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది కొరత ఉన్నందున ప్రైవేట్ ఆసుపత్రుల్లోని వైద్యులు, సిబ్బంది సహకరించడానికి ముందుకు రావాలన్నారు. తమకు అవసరమైన సిబ్బందిని ఉంచుకుని మిగిలిన వారిని క్వారంటైన్, ఐసొలేషన్ వార్డులకు కేటాయించాలన్నారు. గ్రామీణ వైద్యుల సేవలను వినియోగించుకుంటామన్నారు. జిల్లాలోనే చేపలు, రొయ్యలు, కొనుగోలు చేసేలా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వం ఎమర్జెన్సీ పాస్ సిస్టంను ప్రవేశ పెట్టిందని ఈ పాస్ పొందాలంటే గ్రామ వార్డు సచివాలయం, ఎస్.జీవోవి.ఇన్ సైట్‌లోకి వెళ్లి పేరు, జీఎస్‌టీ, మొబైల్ నెంబరు ఎంటర్ చేయాలన్నారు. సమీక్షలో జేసీ డా.వినోద్‌కుమార్, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యాధికారులు, మత్స్యశాఖ జేడీ శ్రీహరి పాల్గొన్నారు.

# వైద్యులకు పిపిఇలు అందజేసిన 'నిఫా ఫ్రెండ్స్'



నెల్లూరు పెద్దాసుపత్రిలోని కరోనా వైరస్ ప్రత్యేక హాస్పిటల్ సిబ్బందికి నిఫా ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకులు పి.పి.ఇ. యూనిట్స్ మరియు కిట్లను అందజేశారు. మంత్రి అనిల్ కుమార్ యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో వాటిని అధికారులకు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ నిఫా ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు మంచి ఆలోచనతో కార్యక్రమాన్ని చేసారని, వారిని చూసి ఆదర్శంగా తీసుకొని మరికొంతమంది కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిఫా ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకులు మల్లిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మల్లిరెడ్డి కోటారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ తేజ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు.. కరోనా దెబ్బ

**- రైతాంగం లబోదిబో**



జిల్లాలో నీటి లభ్యత పుష్కలంగా ఉండి అంచనాకు మించి ఈసారి వరిసాగు సాగినా జిల్లా రైతాంగానికి తిప్పలు తప్పడం లేదు. కరోనా ప్రభావంతో గత కొద్దిరోజులుగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

జిల్లా అధికారులు ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాలు ఏర్పాటుచేసినా కరోనా దెబ్బకు రవాణా వ్యవస్థ నిలచిపోవడంతో కొనుగోళ్ళు దాదాపు నిలిచిపోయాయి. సుమారు పదిరోజులుగా కొనుగోళ్ళు మందగించి పోవడంతో ధాన్యం రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కరోనా ప్రభావం ఇలా ఎంత వరకు ఉంటుందో, అప్పటిదాకా కల్లాల్లోనో, రోడ్లపైనో ఉంచుకున్న ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక అన్నదాతలు అనుక్షణం సతమతమవుతున్నారు. ధాన్యం నింపేందుకు గోతాలు కూడా అందుబాటులో లేకపోవడం, లారీలు రాకపోవడం తదితర కారణాలతో కొనుగోళ్ళు బాగా తగ్గిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటిదాకా 1.50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు జరిగిందని, ఇంకా కనీసం ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళ కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నట్లు రైతాంగం అంచనా వేస్తున్నా, కరోనా దెబ్బతో రవాణా వ్యవస్థ స్తంభించి పోవడంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు వసతులు లేక రైతులు విలవిల్లాడిపోతున్నారు. పండిన ధాన్యాన్ని రైతులు రోడ్లపై రాశులుగా ఆరబోసుకుని ఆందోళనతో నిరీక్షిస్తున్నారు. ఈ ఇబ్బందుల్లో వర్షం వస్తే కష్టపడి పండించుకున్న ధాన్యం ఏమైపోతుందనే ఆవేదన రైతులను కంటికి కునుకులేకుండా చేస్తోంది. ఒకవేళ దురదృష్టవశాత్తూ అకాల వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా భద్రపరుచుకునేందుకు ప్రభుత్వ భవనాలను, పాఠశాలలను కేటాయించాలని రైతులు కోరుకుంటున్నారు. కొనుగోళ్ళ కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేందుకు, ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ చర్యలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిపెట్టి తమను ఆదుకోవాలని రైతులు అభ్యర్థిస్తున్నారు.

### రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి - కలెక్టర్

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు జరిగేలా చూడాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గతనెల 29న ఆయన ధాన్యం కొనుగోళ్ళపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటిదాకా ఒకటిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, వీరిలో నగదు చెల్లింపులు జరగని రైతులకు ఏప్రిల్ 1వ తేది తర్వాత వారి బ్యాంక్ అకౌంట్లలో నగదు జమచేస్తామని, వచ్చే రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందువల్ల ధాన్యం కొనుగోళ్ళకు ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి బాలకృష్ణారావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రోజ్‌మాండ్, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఆనందకుమారి, సహకారశాఖ అధికారి తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

### కార్యదర్శి సస్పెండ్

గత 8రోజులుగా ఎలాంటి సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొట్టిన నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.నారాయణపై జిల్లా కలెక్టర్ ఎమ్.వి.శేషగిరిబాబు వేటు వేశారు. ఆయన్ను విధుల నుండి సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్యులు జారీ చేశారు. సర్వేపల్లి మార్కెటింగ్ కమిటీతో పాటూ, నాయుడుపేట మార్కెటింగ్ కమిటీ కార్యదర్శిగా కూడా విధులు నిర్వహిస్తున్న నారాయణ గత నెల 23వ తేదీ నుండీ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు హాజరు కావడం లేదు. ఆయనకు పలు మార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ అని వస్తుండడంతో అధికారులు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్యులు జారీ చేశారు.

### పేదలకు కూరగాయలు

సూళ్ళూరుపేట మునిసిపాలిటీ పరిధిలోని పేదలకు గతనెల 29న దాతల సహకారంతో కొనుగోలు చేసిన కూరగాయలను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పంపిణీ చేశారు. సుమారు 4500 కుటుంబాలను ఎంపిక చేసి వారికి విడతల వారీగా కూరగాయలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

### పంచాయతీలకు నిధులు

జిల్లాలోని పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14వ ఆర్థిక సంఘ నిధులను విడుదల చేసిందని, 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలివిడత నిధులు 66.16 కోట్లరూపాయలు ఈనెల 1న విడుదలయ్యాయని జిల్లా పంచాయతి అధికారి ఎం.ధనలక్ష్మి తెలియజేశారు. ఈ నిధులను జిల్లాలోని 944 పంచాయతీల ఖజానాలకు కేటాయించారని పేర్కొన్నారు.

# నిరాశ్రయులకు వసతి కేంద్రాల ఏర్పాటు

**- కమిషనర్ పివివిస్ మూర్తి**

కరోనా వైరస్ నేపథ్యంలో నగర వ్యాప్తంగా ఉన్న నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, భోజన వసతులతో పాటు అభాగ్యులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతిక్షణం పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా చేపడుతున్నామని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ పివివిస్ మూర్తి పేర్కొన్నారు. వసతి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న బారాషహీద్ దర్గా, పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం, పొదలకూరు రోడ్డులోని ఎస్సీ వసతి గృహంలో జరుగుతున్న పనులను కమిషనర్ బుధవారం ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశ వ్యాప్త లాక్‌డౌన్ నేపథ్యంలో నగరంలోని యాచకులు, నిరాశ్రయులు, వీధి వర్తకులు, కూలీలకు ఆహారం, వసతి అందని దయనీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు, ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిల సూచనలతో నాలుగు ప్రాంతాల్లో వసతి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలు, ఎన్జీవోల సహకారంతో నగరవ్యాప్తంగా ఉన్న అభాగ్యులను ఆయా కేంద్రాలకు తరలించి, కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కమిషనర్ వెల్లడించారు. అనంతరం స్థానిక ఆత్మకూరు బస్టాండు కూడలిలో మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ చేతుల మీదుగా ఆహార పొట్లాలను అభాగ్యులకు అందజేసారు.

# జిల్లా ప్రత్యేక అధికారిగా రామ్‌గోపాల్

కరోనా వైరస్ వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లాకు ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి, మైనింగ్ శాఖ ఎం.డి రామ్‌గోపాల్‌ను ప్రభుత్వం తాజాగా నియమించింది. ఈనెల 1న ఆయన నెల్లూరుకు వచ్చి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కరోనా పాజిటివ్ కేసులు, విదేశాల నుంచి వచ్చినవారు, ఐసోలేషన్‌లో ఉన్నవారు ఎంతెంతమంది ఉన్నారో అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు, డిఆర్ఓ మల్లికార్జున తదితర అధికారులతో ఆయన సమావేశమయ్యారు.

# నిశ్శబ్దంగా నెల్లూరు!

***నెల్లూరు జిల్లాలో లాక్‌డౌన్ విజయవంతంగా కొనసాగుతోంది. కరోనా వైరస్ నేపథ్యంలో లాక్‌డౌన్‌కు కేంద్ర ప్రభుత్వం పిలుపునివ్వడం తెలిసిందే! మార్చి 22వ తేదీ నుండి అమలులోవున్న లాక్‌డౌన్‌లో ఇప్పటికే 12రోజులు గడిచిపోయాయి. ఇంకో పది రోజులు కళ్ళు మూసుకుంటే లాక్‌డౌన్ గడువును విజయవంతంగా అధిగమిస్తాము. అదీగాక, లాక్‌డౌన్ నిబంధనలను కూడా ఖచ్చితంగా కఠినంగా పాటించాల్సిన పరిస్థితులు కూడా నెలకొన్నాయి. జిల్లాలో వున్నట్లుండి కరోనా పాజిటివ్ కేసులు పెరగడంతో జిల్లా వ్యాప్తంగా ఆందోళన నెలకొంది. జిల్లాలోని పలుచోట్ల కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూడడం తెలిసిందే! ఇంకా ఎన్ని కేసులు బయటపడతాయో తెలియదు? కాబట్టి ప్రజలు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన కీలక తరుణం ఇది.***

కరోనా వైరస్ నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లాక్‌డౌన్ పిలుపుతో నెల్లూరు జిల్లా అంతటా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. లాక్‌డౌన్‌ను ప్రజలంతా క్రమశిక్షణతో పాటిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలన్నీ మూతపడ్డాయి. వాణిజ్య వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. అత్యవసర సర్వీసులు ఇంకేమీ నడవడం లేదు. ఆఖరికి ఆసుపత్రిలో కూడా ఎమర్జెన్సీ కేసులు మాత్రమే చూస్తున్నారు. నెల్లూరు నగరంలో పోలీసులు ఎక్కడికక్కడ రోడ్లను దిగ్బంధం చేశారు. ప్రతి సెంటర్లోనూ బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. అత్యవసర సర్వీసులు మాత్రం అనుమతిస్తున్నారు. ప్రజలు కూడా దాదాపు ఇళ్లకే పరిమితమై ఉన్నారు. నిత్యావసర వస్తువుల కొనుగోలుకు తప్పితే బయటకు రావడం లేదు. ప్రధాన సెంటర్లన్నిటిలోనూ నిశ్శబ్ద వాతావరణం తాండవిస్తోంది. ఎప్పుడూ ప్రజలతో కలకలలాడే ప్రధాన సెంటర్లు, హోటల్స్, మాల్స్ బోసిపోయి ఉన్నాయి. నెల్లూరు ట్రంక్‌రోడ్డు మీద ఎప్పుడు చూసినా వేలసంఖ్యలో ఆటోలు కనిపించేవి, ఇప్పుడు ఆటోలు ఒకటి అరా తప్ప కనిపించడం లేదు. ఇంట్లో కూర్చోలేక సరదాగా రోడ్ల మీదకు వచ్చి బైక్‌లపై చక్కర్లు కొడుతున్న కుర్రాళ్లను పోలీసులు లాఠీలతో కుమ్ముతున్నారు. కాబట్టి అలాంటి కుర్రాళ్ళు బయటికి రావడం కూడా తగ్గిపోయింది. మొత్తానికి లాక్‌డౌన్ దెబ్బతో జిల్లా అంతా నిర్మానుష్యంగా మారింది. నగరాల్లోనే కాదు.. చిన్నచిన్న గ్రామాల్లో సైతం లాక్‌డౌన్ నిబంధనలను ప్రజలు ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల వారిని తమ గ్రామాల్లోకి రానివ్వడం లేదు. కొత్తగా ఎవరైనా వస్తే అధికారులకు సమాచారం ఇచ్చి వారిని వెంటనే క్వారంటైన్‌కి తీసుకెళ్లండని ఫిర్యాదులు చేస్తున్నారు.









## కాలధర్మం

## ఎల్.వి.కృష్ణారెడ్డి



సీనియర్ పాత్రికేయుడు, కార్మిక నాయకుడు, కాంగ్రెసు వాది, యువశక్తి , యూత్‌కాంగ్రెస్ పత్రికల వ్యవస్థాపకుడు, నెల్లూరీయుడు ఎల్.వి.కృష్ణారెడ్డి ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున హైద్రాబాదులోని తన స్వగృహంలో 84వ యేట కన్ను మూశారు. రాజకీయ, సామాజిక, సాహిత్య, సేవా రంగాలలో విలువలున్న వ్యక్తిగా గుర్తింపును పొందాడు ఎల్.వి.కృష్ణారెడ్డి. 1970వ దశకంలో జిల్లా రాజకీయ విశ్లేషణ లకు మూల కేంద్రంగా నెల్లూరు పొగతోటలోని యూత్‌కాంగ్రెస్ కార్యాలయం ఉండేది.

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డికి ఈయనతో ఆత్మీయ సంభందాలు ఉండేవి. యూత్‌కాంగ్రెస్ పత్రికలో వార్తా వ్యవహారాలు పూర్తిగా రాజగోపాలరెడ్డే చూసేవాడు. తరువాతి కాలంలో పత్రికతో సహా కృష్ణారెడ్డి తన మకాం హైదరాబాదుకు మార్చి చరిష్మా ప్రింటర్స్ పేరుతో ఆరోజుల్లో అధునాతన ప్రింటింగ్ ప్రెస్‌ని అక్కడ ప్రారంభించాడు. తన సహచర మిత్రుల భాగస్వామ్యంతో పారిశ్రామిక రంగంలో కూడా కృష్ణారెడ్డి గుర్తింపు సాధించాడు.

విద్యార్థిగా విఆర్ కాలేజీలో చదివే రోజుల్లోనే డెమోక్రిటిక్ స్టూడెండ్ యూనియన్ నాయకుడిగా, కార్యదర్శిగా కూడా పనిచేసాడు. 1957 నుండి సోషలిస్ట్ పార్టీ కార్యకర్తగా ప్రత్యక్ష రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులకు అయన పెద్ద దిక్కుగా వ్యవహరించేవాడు.

మంచి వాగ్ధాటి గల నాయకుడిగా ఆయనకి పేరుంది, చట్ట సభలకి ఎంపికై ప్రజాసేవ చేయాలన్న కోరిక ఆయనలో బలంగా ఉండేది.

లేబూరు వెంకటకృష్ణారెడ్డి అయన పూర్తిపేరు కాగా ఎల్.వి.కెగా అయన ప్రసిద్ధి. నెల్లూరు జిల్లా కోడూరుపాడు అయన స్వగ్రామం. ఆయనకు భార్య కుమారుడు ఇద్దరు కుమార్తెలు వున్నారు. కృష్ణారెడ్డి మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.



## 'ప్రభా'తం

# చైనా కుట్ర దాగుందా?



**ప్రపంచాన్ని పట్టి పీడిస్తూ అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తున్న ఈ కరోనా వైరస్ పుట్టుకపై ప్రపంచవ్యాప్తంగా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ వైరస్ జన్మభూమి చైనా చుట్టూ అనేక అనుమానాలు కమ్ముకుంటున్నాయి. చైనాలోని ఊహాన్ నగరంలో ఈ వైరస్ పుట్టింది. గబ్బిలాల నుండి జంతువులకు, వాటి నుండి మనుషులకు ఈ వైరస్ సంక్రమించినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చైనా ప్రజల ఆహారపు అలవాట్ల కారణంగానే అక్కడ పలు వైరసులు పురుడు పోసుకుంటున్నాయన్నది నగ్నసత్యం. ప్రపంచం మీదకి వైరస్‌ను వదలడం, వాటికి వారే మందులు కనిపెట్టడం, ప్రపంచ దేశాలకు ఆ మందులను అమ్మడం... వైరస్‌ను తమ దేశ ఆర్థిక వనరుగా మలచుకోవడం చైనాకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది.**

భవిష్యత్తులో దేశాల మధ్య బాంబులతో, విమానాలతో, సైనికులతో యుద్ధాలు జరగవు... కేవలం బయో వార్ మాత్రమే ఉంటుంది. ప్రపంచ దేశాలన్నీ కూడా కనిపించని శత్రువుతో యుద్ధం చేస్తాయని నిపుణులు ఎప్పుడో చెప్పారు. ఇప్పుడు అదే జరుగుతోంది. ప్రపంచంలోని 200 దేశాలు కనిపించని ఒక చిన్న సూక్ష్మ జీవితో యుద్ధం చేస్తున్నాయి. ఈ యుద్ధంలో గెలవడానికి నానా తంటాలు పడుతున్నాయి. ఈ యుద్ధంలో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇరు దేశాల మధ్య జరిగే యుద్ధం కంటే కూడా ఈ బయో వార్ అత్యంత ప్రమాదకరంగా మారుతోంది.

ప్రస్తుతం ప్రపంచంలోని 200 దేశాలు కరోనా వైరస్‌తో అలుపెరుగని సమరం చేస్తున్నాయి. అగ్రరాజ్యంగా ప్రపంచానికి పెద్దన్నగా ఎప్పటికప్పుడు ఆధిపత్యం కోసం ఆరాటపడే అమెరికా పెను ముప్పు ముంగిట ఉంది. ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న కరోనా వైరస్ ఇప్పుడు అగ్రరాజ్యాన్ని పట్టి పీడిస్తోంది. ఎలాంటి సవాళ్ళనైనా ఎదుర్కొనే సత్తా ఉన్న అమెరికానే ఈ వైరస్ దాటికి విలవిల్లాడుతోంది. ఆ దేశంలో కరోనా వైరస్ బాధితుల సంఖ్య ఎనిమిది లక్షలకు చేరుకోగా, మృతులు 40 వేలకు దాటారు. అలాగే ఈ వైరస్ యూరప్ దేశాలను వణికిస్తోంది. ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్ దేశాలలో మరణ ఘోష వినిపిస్తోంది. శవాల దిబ్బలు ఏర్పడుతున్నాయి. ఇరాన్, సౌదీఅరేబియా వంటి దేశాలలో కూడా వైరస్ తీవ్రత అధికంగా ఉంది. ప్రపంచంలో ఒకటి రెండు దేశాలు తప్పితే ఈ వైరస్ బారిన పడని దేశం అంటూ లేదు. ఈ వైరస్‌తో స్పెయిన్ యువరాణి మృతి చెందింది, బ్రిటన్ ప్రధాని, బ్రిటన్ రాణి, బ్రిటన్ యువరాజు కరోనా వైరస్ బాధితులు అయ్యారు. ప్రపంచంలో చైనా తర్వాత పెద్ద దేశమైన భారత్ కూడా ఈ వైరస్‌తో పోరాడుతోంది. అయితే ప్రధాని నరేంద్ర మోడీ ముందుచూపుతో ముందుగానే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడం వల్ల మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లో వ్యాధి విస్తరణ అంత వేగంగా లేదనిపిస్తోంది. అయినా కూడా భారత ప్రభుత్వం ఈ వైరస్‌తో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద యుద్ధమే చేస్తోంది.

ఇకపోతే ప్రపంచాన్ని ఇంతగా పట్టి పీడిస్తూ అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తున్న ఈ కరోనా వైరస్ పుట్టుకపై ప్రపంచవ్యాప్తంగా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ వైరస్ జన్మభూమి చైనా చుట్టూ అనేక అనుమానాలు కమ్ముకుంటున్నాయి. చైనాలోని ఊహాన్ నగరంలో ఈ వైరస్ పుట్టింది. గబ్బిలాల నుండి జంతువులకు, వాటి నుండి మనుషులకు ఈ వైరస్ సంక్రమించినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చైనా ప్రజల ఆహారపు అలవాట్ల కారణంగానే అక్కడ పలు వైరసులు పురుడు పోసుకుంటున్నాయన్నది నగ్నసత్యం. చరిత్రలో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన అనేక వైరస్‌లు ఇక్కడే పుట్టాయి. తమ ఆహారపు అలవాట్ల కారణంగానే ఈ ప్రపంచానికి అనారోగ్యాలను బహుమతిగా ఇస్తున్నామనే స్పృహ చైనావాళ్లకు లేకుండా పోతోంది. వాళ్లు తమ ఆహార అలవాట్లను మార్చుకోవడం లేదు. ప్రకృతిని, పర్యావరణాన్ని చెరపడుతూ భూమిపై సంచరించే సకల జీవరాశిని ఆహారంగా తీసుకుంటూ మానవ వినాశనానికి బాటలు వేస్తున్నారు.

కరోనా వైరస్ పుట్టుకలో ఇంకో కోణం ఏంటంటే... ఇది చైనా సృష్టేనని భావిస్తుండటం! వైరస్‌తో వ్యాపారం చేయడం చైనాకు అలవాటయింది. ప్రపంచం మీదకి వైరస్‌ను వదలడం, వాటికి వారే మందులు కనిపెట్టడం, ప్రపంచ దేశాలకు ఆ మందులను అమ్మడం... వైరస్‌ను తమ దేశ ఆర్థిక వనరుగా మలచుకోవడం చైనాకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. చైనాలోని ఊహాన్‌లో ఈ వైరస్ పుట్టింది. ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఈ నగరం వ్యతిరేకంగా ఉంటుంది. అంత పెద్ద చైనాలో కేవలం ఈ నగరంలో మాత్రమే వైరస్ ఎక్కువగా వ్యాపించింది. ఇక్కడే మృతుల సంఖ్య ఎక్కువగా ఉండింది. కొద్దిరోజుల్లోనే చైనా ఇక్కడ వైరస్‌ను అరికట్ట కలిగింది. ఊహాన్ నగరంలో ఇప్పుడు సాధారణ జన జీవనం నెలకొంది. అయితే ఇక్కడ పుట్టిన వైరస్ ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తూ విలయతాండవం చేస్తోంది. ఈ వైరస్ గురించి చైనా కూడా పూర్తి సమాచారాన్ని ప్రపంచ దేశాలకు ఇవ్వలేదు. ప్రపంచానికి సరైన సలహాలు ఇవ్వాల్సిన ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ వైరస్ విషయంలో ప్రపంచ దేశాలను తప్పుదోవ పట్టించింది. ఈ వైరస్ మనిషి నుండి మనిషికి వ్యాపిస్తుందని ఆ సంస్థ చెప్పకపోవడం వల్లే చాలా దేశాలు ఈ వైరస్ విషయంలో అప్రమత్తం కాలేకపోయాయి. ఉదాసీనత చూపాయి. ఈ వైరస్ ప్రమాదం గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ వాస్తవాలు వెల్లడించి ఉంటే రెండు నెలల ముందే అన్ని దేశాలు కూడా చైనాతో అంత ర్జాతీయ సంబంధాలను తెంచేసుకుని ఉండేవి. ఈరోజు అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాలు ఇంత తీవ్రంగా నష్టపోయి ఉండేవి కావు. ముఖ్యంగా చైనాకు కావాల్సింది అమెరికాను దెబ్బతీయడం. కరోనా వైరస్ విషయంలో చైనా ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నట్లే! ఈ వైరస్ మూలంగా ఏర్పడిన నష్టాన్ని పూడ్చుకోవాలంటే అమెరికాకు కనీసం రెండేళ్ల పడుతుంది. ఈలోపు చైనా ప్రపంచం మీద ఆధిపత్యం చెలాయిస్తుంది. ఆర్థిక రంగంలో ఆ దేశం అమెరికాను దాటిపోతుంది. అమెరికాను దెబ్బతీయడానికి చైనా ఈ వైరస్‌ను సృష్టించిందనేది కూడా ఇప్పుడు బలంగా వినపడుతున్న అభిప్రాయం.

ఉద్దేశ్యపూర్వకంగా చైనా ఈ వైరస్‌ను సృష్టించి ఉంటే మాత్రం ఇది క్షమించరాని నేరం. చైనా ప్రపంచ ద్రోహిగా నిలిచిపోతుంది. కేవలం ఆధిపత్యం కోసం ప్రజల ప్రాణాలతో ఆటలాడుకునే చర్యలకు పాల్పడితే ఇంతకంటే దుర్మార్గం మరొకటి ఉండదు. ప్రపంచ దేశాలన్నీ కూడా ఇలాంటి బయో ఉత్పాతాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వైరస్‌ను సృష్టించే దేశాలపై సామూహిక పోరాటానికి సిద్ధం కావాలి.!

---

### కరోనా ప్రబలకుండా..
## కోనలో ధన్వంతరి హోమం

కరోనా వ్యాధి నేపథ్యంలో దేశప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని, ఈ ప్రాణాంతకమైన కరోనా వ్యాధితో ప్రజలు బాధపడకుండా, ఈ వ్యాధి వ్యాప్తి కాకుండా చూడాలని ప్రార్థిస్తూ ఆరోగ్యప్రదాత ధన్వంతరికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచల కోన దేవస్థానంలో గతనెల 27న ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామయ్యస్వామి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయంలోని శ్రీవారి ముఖమండపంలో భక్తిశ్రద్దలతో శ్రీ లక్ష్మీ నరసింహ సుదర్శన సహిత ధన్వంతరి హోమాన్ని నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు.



## చల్లా యానాదులకు ఆహార ప్యాకెట్లు

నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని కావేరి గుంట గిరిజన కాలనీ సమీపంలో ఈనెల 28 న చల్లా యానాదులకు లయన్స్ క్లబ్ క్యాంపు ఛైర్మన్ డి. రమేష్ కుమార్ గుప్తా చేయూతతో వైవియస్ పౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ యస్ బాబూరావు ఆధ్వర్యంలో డీయస్పీ ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు.

### జొన్నవాడలో
## మహా మృత్యుంజయ హోమం

కరోనా మహమ్మారి వ్యాధి నుంచి ప్రజలను రక్షించాలని ప్రార్థిస్తూ బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో గతనెల 31న ఆలయ అర్చకులు ఎంతో భక్తిశ్రద్దలతో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. స్వామివార్లకు తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ చీమల రమేష్‌బాబు, ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి తదితరుల పర్యవేక్షణలో ఈ హోమం చేపట్టారు.




## నిజమైన భారతీయుడు టాటా

భారతదేశంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ప్రజలను ఆదుకోవడానికి ముందుకు వచ్చే పారిశ్రామిక సంస్థ టాటా. భారతదేశం గర్వించదగ్గ సంస్థ. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా మానవతా దృక్పథంతో దేశానికి వారు అందించే సేవలు అమోఘం. గతంలో వరదలు, తుఫాన్లు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాలలో వాళ్ళు మానవత్వంతో ప్రజలను ఆదుకున్నారు. ఇప్పుడు కరోనా వైరస్ మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేస్తున్న తరుణంలో మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. కరోనా వైరస్‌పై భారత ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న యుద్ధానికి 1500 కోట్ల రూపాయలు విరాళంగా ప్రకటించి తమ దేశభక్తికి ఎవరు సాటిరాలేరని నిరూపించుకున్నారు. దేశం పట్ల నిబద్ధత కలిగిన టాటా ఉత్పత్తులను ప్రజలు కూడా ఆదరించాలి

**పర్లకుంట మహేష్, హైదరాబాద్.**

## పోలీసులకు అండగా నిలుద్దాం

ఓ పక్క దేశమంతా ఇంట్లోకి వచ్చింది. లాక్‌డౌన్‌తో అన్నీ మూతపడ్డాయి. అందరూ ఇళ్లలో కూర్చున్నారు. కానీ పోలీసులు మాత్రం 24 గంటలూ రోడ్లమీద విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు వారికి పని ఎక్కువగా ఉంది. పోలీసులు, వైద్యులు, నర్సులు, పారిశుద్ధ్య కార్మికులను గౌరవిద్దాం, వారి విధులకు ఆటంకం కలిగించకుండా చూద్దాం. ఎక్కడో ఒకటి రెండు చోట్ల అడ్డదిడ్డంగా తిరుగుతున్న వారిని పోలీసులు లాఠీలతో కొడితే... దాన్ని నేరంగా చూడవద్దు. దీనివల్ల పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బ తింటుంది. వాళ్ళు విధులు ఎగ్గొడితే మొదటికే మోసం వస్తుంది. లక్ష్యం నెరవేరదు. కాబట్టి ఈ సమయంలో మనం పోలీసులకు మద్దతుగా నిలవాలి.

**నల్లపాటి సతీష్, నెల్లూరు.**


## జీతాలు కోత వేయండి

ప్రస్తుతం దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోలేకపోతోంది. ప్రజలంతా త్యాగాలకు సిద్ధం కావాల్సిన సమయం ఇది. ప్రతి ఒక్కరు కూడా ఒక మూడు నెలలు తమ ఇంటి అవసరాలకు మాత్రమే ఆదాయం చూసుకోవాలి, మిగులు గురించి ఎవరూ ఆలోచించకూడదు. నెలకు 50 వేలుపైన జీతాలు ఉండే వాళ్లంతా సగం జీతాన్ని వదులుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగులే కాదు, ప్రైవేటు ఉద్యోగులు కూడా దీనికి సిద్ధపడాలి. ప్రతి కుటుంబానికి నెలకు 25 వేల రూపాయలకు మించి ఖర్చు కాదు. కాబట్టి అందరూ ఆర్థిక త్యాగాలకు సిద్ధం కావాలి. **– జంపా రూపేష్, తిరుపతి.**

## మతోన్మాదులను కాల్చి పడేయాలి

దేశం ఇంతటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో కూడా కొందరు మతోన్మాదుల ఉన్మాద చర్యలు విభ్రాంతి కలిగిస్తున్నాయి. వీళ్ల దేశం కంటే తమ మతమే గొప్పది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కరోనా వైరస్‌కు ఇప్పటివరకు మందు లేదు. కానీ కొందరు మత ఉన్మాదులు మాత్రం పవిత్ర జలంతో, పవిత్ర రక్తంతో వైరస్‌ను తగ్గిస్తామని అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఇలాంటివారిని తన్ని తగలేస్తేనే దేశం బాగుపడుతుంది.

**వి.ప్రపంచిక, నెల్లూరు.**



# ఇంగ్లండ్‌ను ఏలుతున్న ఇండియా!

ఓడలు బండ్లు, బండ్లు ఓడలు కావడం అంటే ఇదే! ఒకప్పుడు ప్రపంచాన్నంతా బ్రిటీష్‌వాళ్ళు పరిపాలించారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం అనే పేరు కూడా వుంది. ఈ క్రమంలోనే ఇండియాను కూడా వాళ్ళు 200 ఏళ్ల పాటు పరిపాలించారు. బ్రిటీష్ నుండి విముక్తి కోసం చేసిన పోరాటాలు, చేసిన ప్రాణ త్యాగాలు... అదంతా పెద్ద చరిత్ర.

ఇప్పుడు కాలం తిరగబడింది. అన్ని సమస్యలకు, కాలమే సమాధానం చెబుతుంది. ఇప్పుడు కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తోంది. అందులో బ్రిటన్ కూడా వుంది. బ్రిటన్ యువరాజు, రాణిలతో పాటు ప్రధాని బోరిస్ జాన్సన్‌కు కూడా కరోనా వైరస్ సోకింది. దీంతో వాళ్ళు క్వారంటైన్‌లో వున్నారు. బ్రిటన్ ఆరోగ్య మంత్రికి కూడా కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో బ్రిటన్ మంత్రివర్గంలో కీలకంగా వున్న ఇద్దరు మంత్రులకు ఆ దేశ పరిపాలనా బాధ్యతలు అప్పగించారు. రిషీ సునక్, ప్రీతి పటేల్ ఇప్పుడు బ్రిటన్ దేశ పాలనా బాధ్యతలు చూస్తున్నారు. ఈ ఇద్దరు కూడా భారతీయ సంతతికి చెందినవారు కావడం గమనార్హం.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- 1456 మందిపై కేసులు నమోదు

కరోనా వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యల్లో భాగంగా జిల్లా ఉన్నతాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నియమ నిబంధనల మేరకు దూరం పాటించడం, ప్రతి ఒక్కరూ ఇళ్ళల్లోనే ఉండడం, సామాజిక దూరం పాటించడం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని, ప్రజల ఆరోగ్యం కోసం, ప్రజాశ్రేయస్సుకోసం అమలుచేస్తున్న ఈ నియమాలను ఎవరూ ఎట్టి పరిస్థితుల్లోనూ అధిగమించవద్దని పదేపదే విజ్ఞప్తి చేస్తున్నారు. నిత్యావసరాలు, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్ళేందుకు అనుమతిస్తున్నారు.

రోడ్లపై ఇష్టం వచ్చినరీతిలో వాహనాల్లో తిరిగేవారికి అన్నివిధాలుగా చెప్పన్నారు. అప్పటికీ మాట వినని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. వాహనాలను సీజ్ చేస్తున్నారు. కరోనా వ్యాధి ఎంత భయంకరమైనదో, ఎలా వ్యాపిస్తుందో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దాని నుంచి దూరంగా ఉండేందుకు వ్యక్తికి వ్యక్తికి మధ్య దూరం పాటించడం అత్యవసరమని, గుంపులుగా ఎక్కడా తిరగరాదని, అత్యవసరమైతే తప్ప ఇళ్ళనుంచి బయటకు రావడం మానుకోవాలని సూచిస్తున్నారు.



కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు

ఇలా అన్నిరకాలుగా.. ప్రాణాంతకమైన ఈ వ్యాధి వ్యాప్తిని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా అధికారయంత్రాంగం, పోలీసుశాఖ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటోంది. కరోనా నియంత్రణలో భాగంగా జిల్లాలో అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ భాస్కర్‌భూషణ్‌లు సమీక్షిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన రోజువారీ రిపోర్టులను తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. ప్రత్యేకించి విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలు సేకరించి, వారికి వైద్యపరీక్షలు చేయించడం, ఐసోలేషన్‌లో ఉంచడం వంటి చర్యలను మరింత శ్రద్ధతో పర్యవేక్షిస్తున్నారు.

# మేం కోరింది ఇవ్వాలంతే...

ఈ కరోనా వైరస్ కరువుకాలంలో అందరూ మూడు పూటలా దొరికింది తిందామనే ఆలోచనలో వున్నారు. కొందరైతే తిండి యావను తగ్గించుకుంటున్నారు. చాలామంది పేదలు తిండి లేక, స్వచ్ఛంధ సంస్థల వాళ్ళు పెట్టిన ఆహారాన్నే అమృతప్రాయంగా భావిస్తున్నారు. కాని గూడూరు ఆదిశంకర కాలేజీలో క్వారంటైన్‌లో వున్న 218 మంది మత్స్యకారులు మాత్రం మేం అడిగింది పెడితేనే ఇక్కడ వుంటామని అధికారులను దబాయిస్తున్నారు. అధికారుల ముందు హోటల్ మురళీకృష్ణ మెనూ లాంటిది పెడుతున్నారు.



వివరాల్లోకి వెళితే... కరోనా వైరస్ నేపథ్యంలో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడం తెలిసిందే! నెల్లూరుజిల్లాకు చెందిన 200 మందికిపైగా కూలీలు కర్నాటకలో చిక్కుకుపోయారు. జిల్లా మంత్రులు, అధికార యంత్రాంగం చొరవ తీసుకుని వారిని ప్రత్యేకబస్సుల ద్వారా అక్కడ నుండి తీసుకొచ్చి గూడూరు ఆది శంకర కాలేజీలో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌లో వుంచారు. అయితే అధికారులు పెడుతున్న సాంబారు అన్నం, పులిహోర, పెరుగన్నం వారికి నచ్చలేదు. మాంసాహారం కావాలంటూ డిమాండ్ చేశారు. ఉదయం అల్పాహారంలో కూడా రకరకాలు కోరారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భోజనంలో చికెన్, మటన్, ప్రాన్స్, ఫిష్ వంటివి వుండాలని ఆర్డర్ వేశారు. ఈ కష్టకాలంలో వీరి కోర్కెలకు అధికారులు షాక్ తిన్నారు.



## 1456 మందిపై క్రిమినల్ కేసులు నమోదు

కరోనా మహమ్మారి వ్యాధిని తరిమికొట్టేందుకు ప్రజలు సహకరించాలని, ప్రజలంతా ఇళ్లలోనే ఉండి పోలీసులకు సహకరించాలని, ఎవరినీ కలవకుండా.. ఎవరినీ మీ ఇళ్లకు రానివ్వకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ప్రజలకు సూచించారు. అనవసరంగా రోడ్లపై తిరుగుతున్నవారి వివరాలు సేకరిస్తున్నామని, ఇకపై వారు రోడ్లలో తిరిగితే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించారు. కరోనా వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యల్లో భాగంగా జిల్లాలో నిబంధనలు అతిక్రమించి రోడ్లపై తిరుగుతున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పటిదాకా జిల్లావ్యాప్తంగా 1456 మందిపై 917 క్రిమినల్ కేసులు పెట్టామని, 905 వాహనాలు సీజ్ చేశామని గతనెల 29న జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ తెలియజేశారు. అదేవిధంగా, మోటార్ వెహికల్ యాక్ట్ కింద 7808 వాహనాలకు 45,75,580 రూపాయలు జరిమానా విధించామని పేర్కొన్నారు. జిల్లాలో లాక్‌డౌన్ నేపథ్యంలో 114 సెక్షన్ అమలులో ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

రైతుల వద్ద ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



ఈ సీజన్‌లో ప్రత్యేకంగా నెల్లూరు జిల్లాలోనే వరి పంట చేతికొస్తుందని, కరోనా నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులతో రైతులు పలు రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో ప్రస్తుత సీజన్లో సుమారు 16 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా అని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఒకటిన్నర లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులే నేరుగా కొంతమేర అమ్ముకున్నారని వెల్లడించారు. ఇంకా కోత కోయాల్సిన ధాన్యంతో పాటు రైతుల వద్ద నిల్వలతో కలిపి ప్రస్తుతం జిల్లాలో 10లక్షల టన్నుల ధాన్యం వస్తుందని, లాక్‌డౌన్ నేపథ్యంలో పొరుగురాష్ట్రాలకు తోలే అవకాశం లేకపోవడంతో పాటు జిల్లాలోని మిల్లర్లు కూడా కొనుగోళ్లకు నిరాకరిస్తున్నారన్నారు. కొన్ని చోట్ల మిల్లర్లో, దళారులో లేక వ్యాపారులో కొనుగోలు చేసినప్పటికీ రైతుల బలహీనతను చూసుకుని తరుగు, నెమ్ము తీసుకోవడంతో పాటు కరోనా నుంచి బయటపడిన తర్వాతే నగదు చెల్లిస్తామని చెబుతున్నారని, నిస్సహాయస్థితిలో కొందరు రైతులు వారికే విక్రయిస్తున్నారన్నారు. రైతులను కష్టాల నుంచి బయటేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

ప్రస్తుతం నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి నగదును రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేయాలన్నారు. తెలంగాణలో ధాన్యం మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేసి బ్యాంకు అకౌంట్లలో నగదు జమ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పొరుగురాష్ట్రాలకు రవాణా ఉన్న పరిస్థితుల్లో కూడా టీడీపీ హయాంలో 2016లో 3.60లక్షల టన్నులు, 2018లో 2.70 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇప్పుడు బయట మార్కెట్ లేని నేపథ్యంలో రైతులను ఆదుకోవాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మరోవైపు రొయ్యల హార్వెస్టింగ్, రవాణాకు ఇబ్బందులు లేకుండా చేయడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ధరలకు కొనుగోలు చేసి ఆక్వా రైతులకు అండగా నిలిస్తే సంతోషమేనని సోమిరెడ్డి పేర్కొన్నారు.

## ప్రత్యేకాధికారిగా బి.శ్రీధర్

కరోనా వ్యాధి వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలోని 13 జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. నెల్లూరుజిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి బి.శ్రీధర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



### శ్రీరామనవమి వేడుకలు
## ఆలయాలకే పరిమితం

కరోనా కారణంగా రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు జిల్లాలోని వైష్ణవాలయాలలో ఈనెల 2 వ తేదీ శ్రీరామనవమి వేడుకలను ఆలయాలలోనే నిరాడంబరంగా జరుపుకున్నారు. సంప్రదాయం ప్రకారం అర్చకులు కరోనా ప్రభావానికి లోనుకాకుండా సామాజిక దూరాన్ని పాటిస్తూ సీతారామ కళ్యాణాలు జరిపించారు.

### కోవిడ్ సెంటర్
## ఇన్‌చార్జిగా శ్రీకాంత్‌రెడ్డి

నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల కోవిడ్ సెంటర్ ఇన్ చార్జిగా జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్ రెడ్డి నియమితులయ్యారు. కరోనా వైరస్ సమాచారం కోసం హెల్ప్ లైన్ల నెంబర్లు 0861-2356031, 2356032, 2356033, 2356034, 1800 4656040 నంబర్లు 24 గంటలపాటు అందు బాటులో ఉంటాయన్నారు.

### డికెడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్
## పదవీ విరమణ

నెల్లూరు డికెడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ బి.వెంకయ్య గతనెల 31న పదవీ విరమణ చేశారు. కరోనా ప్రభావం వల్ల ఎలాంటి ఆర్భాటాలకు తావు లేకుండా ఆయన కార్యాలయంలో పదవీ విరమణ చేయడం జరిగింది. ఈ మేరకు ఆయన సేవలను ప్రశంసిస్తూ ప్రిన్సిపల్స్, అధ్యాపక సంఘం నాయకులు వరప్రసాద్, దీనదయాళ్, గౌస్ బాషా, మోహన్ రావు, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు కె.శ్రీని వాసులు, కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

### పారిశుద్ధ్య సిబ్బందికి
## మాస్కులు పంపిణీ

నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి వారి ఆరోగ్యభద్రత దృష్ట్యా మాస్కులు, శానిటైజర్లు, చేతి తొడుగులు పంపిణీ చేశారు. నగరపాలకసంస్థ వెటర్నరీ అధికారి డా. మదన్‌మోహన్ ఆధ్వర్యంలో గతనెల29న నెల్లూరు లోని పాత మునిసిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి ఈ రక్షణ ఉపకరణాలు పంపిణీ చేశారు.

నెల్లూరు కబుర్లు

### నెల్లూరు పెద్దాసుపత్రిలో
## కరోనా బాధితులు 86

ఇటీవల ఢిల్లీకి వెళ్ళి వచ్చిన గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన కొంతమందికి కరోనా పాజిటివ్ రావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వారితో కలిసి రైల్లో జిల్లాకు చెందిన నెల్లూరు, అల్లూరు, విడవలూరు, గూడూరు, వింజమూరు, బోగోలు తదితర మండలాలకు చెందిన 73 మందిని గతనెల 29 రాత్రి పెద్దాసుపత్రిలో కరోనా క్వారంటైన్ వార్డుకు తరలించారు. గతనెల 30 వ తేదీ నాటికి ఆసుపత్రిలో 86 మంది అడ్మిట్టై ఉన్నారు. వీరిలో ఆరుమంది ఐసోలేషన్‌లో వుండగా, మరో 80 మంది క్వారం టైన్‌లో వున్నారు. ఢిల్లీ నుంచి రైల్లో వచ్చిన వారిలో మరో 200 మందితో కూడిన జాబితా వైద్యశాఖ అధికారులకు అందింది. ఆ జాబితాను పరిశీలించి వీరందరిని కూడా ఆసుపత్రి క్వారంటైన్‌కు తర లించనున్నారు.

### కోవిడ్-19 పరీక్షలు చేయించుకోవాలి

ఢిల్లీలోని హజరత్ నిజాముద్దీన్ ప్రాంతంలో మార్చినెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తబ్లిక్- ఏ-జమాత్ సంస్థ నిర్వహించిన సమావేశానికి జిల్లా నుంచి వెళ్ళి వచ్చినవారు విధిగా కోవిడ్-19 వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు గతనెల 31న ఒక ప్రకటనలో తెలి పారు. సందేహాలకు కోవిడ్ కంట్రోల్ నంబరు 96182 32115, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 9849902361, 9700273955ను సంప్రదించాలని కోరారు.

## శానిటైజర్లకు మిల్లర్ల విరాళం

రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మిల్లర్లు గతనెల 31న నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యా లయంలో మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిసి శానిటైజర్ల కోసం రూ.5లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వైకాపా నాయకులు ముక్కాల ద్వారకానాథ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్‌లతో పాటు విరాళం అందజేసిన రంగయ్యనాయుడు, కోటేశ్వరరావు, మునగా నాగేశ్వరరావు, కె.రామ్మోహన్, పచ్చిపులుసు నరశింహారావు, మునగా వెంకటేశ్వర్లు, ఎస్.కోటయ్య, ఎ.మల్లిఖార్జున పాల్గొన్నారు.

### కరోనాని తరిమికొడదాం...
# ఆంధ్రను ఆరోగ్యాంధ్రను చేద్దాం!

**- మంత్రి ఆళ్ల నాని**



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను, సూచ నలను ప్రజలందరూ ఖచ్చి తంగా పాటిస్తూ, లాక్‌డౌన్ కార్యక్రమాన్ని విజయవం తంగా అమలు చేయడంతో పాటు, కరోనా వైరస్‌ను అరి కట్టేందుకు ప్రభుత్వం చేపడు తున్న కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖమంత్రి ఆళ్ల నాని పిలుపునిచ్చారు.

గతనెల 31న నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిలతో కలసి జిల్లాలో కరోనా వైరస్ నిరోధకానికి జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలు, ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పంపిన నివేదిక ప్రకారం విదేశాల నుండి 30,990 మంది రాష్ట్రానికి రావడం జరిగిందని, ఇందులో 30,693 మందిని హోమ్ ఐసోలేషన్‌లో ఉంచడం జరిగిందని, 262 మందిని ఆసుపత్రి ఐసోలేషన్‌లో ఉంచడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఈరోజు వరకు 40 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు నమోదు కావడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించి శానిటైజేషన్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 30 మంది ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో జరిగిన ఒక ప్రార్థనా కార్యక్రమానికి రాష్ట్రం నుండి పెద్దఎత్తున హాజరై రాష్ట్రానికి తిరిగి రావడం వలన రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కరోనా వైరస్ టెస్టింగ్ కేంద్రాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు, జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్, జాయింట్ కలెక్టర్ డా. వి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు 5 అంబులెన్స్‌లు

రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు 5 అంబులెన్స్ లను మంజూరు చేసింది. ఇప్పటి వరకు 26 అంబులెన్స్‌లు ఉన్నాయి. వీటితోపాటు అవి కూడా పని చేయనున్నాయి. ప్రస్తుతం నగరంలో కోవిడ్ విధుల్లో 2 అంబులెన్స్‌లు ఉన్నాయి.

### ఈ-పాస్ విధానంతో
## వాహనాలకు ఇబ్బందులుండవు

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఈ-పాస్ విధానాన్ని అమలులోకి తీసుకుని రావడంతో అత్యవసర సేవలు, నిత్యావసర సరుకులు, ఫార్మాస్యూటికల్ సంస్థలకు చెందిన వాహనాలకు ఏలాంటి ఇబ్బందులు ఉండవని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గతనెల 31న నెల్లూరు జెడ్పీ కార్యాల యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ షాపులకు మందులు సరఫరా చేసే వాహనాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విని యోగించే వాహనాలు, కూరగాయలు, పాలు సరఫరా చేసే వాహనాలకు ఈ-పాస్ విధానం వల్ల చెక్ పోస్టుల వద్ద ఇబ్బందులు ఉండవన్నారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ ఎస్‌వీ నాగేశ్వరరావు, డీఎస్‌వో బాలకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధికి 17.40 లక్షలు

**- కెజీబివి ఉపాధ్యాయుల వితరణ**

కరోనా వైరస్ నియంత్రణకు రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తమవంతు సహకారం అందిస్తూ నెల్లూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఉపాధ్యాయులు ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందిస్తున్నట్లు కస్తూర్బాగాంధీ ఉపా ధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్‌బిటివిఎన్ దేవి, సహాధ్యక్షురాలు ఎన్.సుజాత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరి, రాష్ట్ర కార్యనిర్వాహకురాలు కె.మాలిని ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవి ఉపా ధ్యాయులు 2400 మందికి సంబంధించి ఒకరోజు వేతనం 17.40 లక్షలు ప్రభుత్వానికి అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## విజిలెన్స్ తనిఖీలు


**● 50 లక్షల సరుకు స్వాధీనం**

నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న పప్పుల వీధిలో గతనెల27న విజిలెన్స్ అధికారులు, తూనికలు కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో అధికారులు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పప్పులవీధిలోని కళ్యాణి ట్రేడర్స్‌లో తనిఖీలు చేసి లెక్కల్లో అవకతవకలు, అధికధరలకు విక్రయించడం వంటి వాటిని గుర్తించి ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. 50,24,813 రూపాయల విలువజేసే సరుకును సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్‌కె ట్రేడర్స్‌లో తనిఖీలు చేసి కంపెనీల పేర్లు, చిరునామాలు లేకుండా ఉన్న సరుకులు విక్రయిస్తుండడాన్ని చూసి కేసు నమోదుచేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తర పున డిసిటిఓలు విష్ణురావు, రవికుమార్, సిఐ మాణి క్యాలరావు, సివిల్ సప్లయిస్ ఏఎస్ఓ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణ, తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### అధిక ధరలకు విక్రయిస్తే
## కఠిన చర్యలు

కూరగాయలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనీల్‌కుమార్‌యాదవ్ హెచ్చరించారు. సోమవారం ఆయన నెల్లూరు నగర నియోజకవర్గపరిధిలోని జనార్ధన్‌రెడ్డి కాలనీ, వెంక టేశ్వరపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, శెట్టిగుంటరోడ్డు, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లోని సంచార కూరగా యల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడి ఏర్పాట్లను, సౌకర్యాలు ధరలను అడిగి తెలుసుకు న్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయిం చాలని, సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసు కోవాలని వ్యాపారులకు సూచించారు. మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకనాథ్, వై.ఎస్.ఆర్.సి.పి. నాయకులు కర్తం ప్రతాప్‌రెడ్డి, దేవరకొండ అశోక్, ఓబిలి రవిచంద్ర, పి.వెంకటేశ్వర్లురెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

### ● కరోనా ఎఫెక్ట్ ...
# పెళ్లి.. మళ్లీ..



కరోనా వైరస్ వల్ల చాలా పెళ్ళిళ్లు వాయిదా పడ్డాయి. జనాలు ఒకచోట గుమికూడకుండా ప్రభుత్వాలు ఆంక్షలు విధించడంతో వివాహాలు జరిపించడానికి వీలు లేకుండా పోయింది. మామూలుగా హిందువులు ఫాల్గుణ, చైత్ర, వైశాఖ మాసాల్లో వివాహాలకు ముహూర్తాలు పెట్టు కుంటుంటారు. ఏడాది మొత్తం మీద దాదాపు 60 వేల వరకు పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి. ఈ ఏడాది మార్చి 25 నుంచి చైత్రమాసం ప్రారంభమైంది. ఏప్రిల్ 4, 9, 11, 14, 16, 17, 30 తేదీలు, మే 1న పెళ్ళి ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. ఆయా తేదీల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిపించడానికి రెండు, మూడు నెలల ముందే ముహూర్తాలు నిశ్చయించుకున్నారు. కొంతమందైతే ఇప్పటికే పెళ్ళి పత్రికలు పంపిణీ చేసి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఇంతలో మార్చి 22 జనతా కర్ఫ్యూ, 23 నుండి ఏప్రిల్ 14 వరకు లాక్ డౌన్ ప్రకటించడంతో ఏప్రిల్ 14 తర్వాత ఎటువంటి పరిస్థితులు ఉంటాయోనని అంచనా వేయలేని పరిస్థితిలో వున్నారు. దీంతో ఇప్పటికే నిశ్చయించిన ముహూర్తాల్లో 95శాతంపైగా వివాహాలు నిరవధికంగా వాయిదాపడ్డాయి. లాక్‌డౌన్ ఎత్తివేస్తే ఏప్రిల్ నెలాఖరు లేదా మే నెలలో వివాహాలు జరిపించాలనే ఉద్దేశ్యంతో కొంతమంది వున్నారు. మే22 నుంచి జ్యేష్ఠ మాసం, అనంతరం వచ్చే ఆషాఢ మాసంలో వివాహాలకు ముహూర్తాలు వుండవు. ఆగస్టు (శ్రావణం), నవంబర్ (కార్తీకం), నెలల్లో మంచి ముహూర్తాలు ఉండడంతో చాలామంది అప్పటికి వాయిదా వేసుకున్నారు. ముందుగా బుక్ చేసుకున్న ఫంక్షన్ హాళ్ళు, కల్యాణ మండపాలు, హోటళ్ళలో వేదికలను రద్దు చేసుకుంటున్నారు. పురోహితులు, కేటరింగ్, పూల డెకరేషన్, లైటింగ్, సన్నాయి, బ్యాండ్ మేళం, మ్యారేజ్ ఈవెంట్ల నిర్వాహకులు, ఇలా అందరూ ప్రస్తుతం ఖాళీగా ఇంటి వద్ద ఉంటున్నారు.

# ఎక్కడి వారు అక్కడే

- **కరోనాకు దూరంగా.. స్వీయనిర్బంధంలో ప్రజలు**
- **ఎటుచూసినా కర్ఫ్యూ వాతావరణం**

కరోనా వ్యాప్తిని నిరోధించడానికి ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రజలంతా ఎక్కడి వారు అక్కడనే ఉండిపోయారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు ఎవరి ఇళ్ళల్లోనే వాళ్ళుండిపోయారు. నిత్యావసరాలు, అత్యవసరాల మేరకు నియమ నిబంధనల మేరకు ఉదయం వేళల్లో ఓ మూడు గంటల పాటు మినహా మిగిలిన రోజంతా ఎవరి ఇళ్ళల్లో వారు ఉండిపోవడంతో వీధులు నిర్మానుష్యమైపోయాయి. ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలులో ఉండడంతో జిల్లాలోనూ ప్రతి మారుమూల గ్రామంలోనూ కూడా ఎక్కడివారు అక్కడనే ఉండిపోయారు. పల్లె నుంచి పట్టణాల దాకా.. నెల్లూరు నగరవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి.

మరోవైపు కరోనా వైరస్‌ను నివారించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. పగలనక, రాత్రనక పోలీసు అధికారులు, సిబ్బంది కలసి ప్రజలు ఎవరూ బయటకు రాకుండా, ప్రజలు కరోనాకు గురికాకుండా అప్రమత్తంగా ఉన్నారు. జిల్లా సరిహద్దులను మూసివేసి, ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు ముమ్మరం చేశారు. నగరంలో ప్రతి కూడలిలోనూ బ్యారికేడ్లు ఏర్పాటుచేసి ప్రజలు చిత్తం వచ్చినరీతిగా బయట తిరగకుండా కట్టడి చేస్తున్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాలు, మాల్స్, సినిమాహాల్స్ అన్నీ మూతపడ్డాయి. ఎవరూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్ళకుండా పూర్తి స్థాయిలో కట్టడి చేస్తున్నారు. దీంతో అన్ని రంగాలు స్తంభించిపోయాయి. అనేక చోట్ల ప్రజలే స్వచ్ఛంధంగా తమ ప్రాంతాల్లోకి ఎవరూ రాకండి అంటూ గ్రామాల సరిహద్దుల్లో ముళ్ళకంపలు, రాళ్ళు అడ్డంగా పెడుతున్నారు. రోడ్లు మూసేస్తున్నారు.

లాక్‌డౌన్ నేపథ్యంలో నగరంలో నిర్ణీత సమయం దాటిన తర్వాత రోడ్లపై ఎవరూ తిరగకుండా జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఆదేశాలతో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. అత్యవసరమైన పని ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తున్నారు. అనవసరంగా రోడ్లపై తిరుగుతున్నవారిని కట్టడి చేస్తున్నారు. గుంపులుగా తిరగకూడదని, నిత్యావసరాల కొనుగోలు సందర్భంలో కూడా సామాజిక దూరం పాటించాలని పదేపదే చెప్తున్నారు. మాట విననివారిపై అవసరమైతే లాఠీలు ఝుళిపిస్తున్నారు. ఇష్టం వచ్చినట్లు రోడ్లపై తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తూ, వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. జరిమానాలు కూడా విధిస్తున్నారు. కరోనా వ్యాధి పట్ల ప్రజలకు పోలీసులు, అధికారులు అవగాహన కలిగిస్తూ మైకుల్లోనూ ప్రచారం చేస్తున్నారు. దీంతో నగరంలో జన సమ్మర్దంగా ఉండే రోడ్లన్నీ ఇప్పుడు ఒక్క మనిషి కూడా కనిపించనంతగా పూర్తిగా కర్ఫ్యూ వాతావరణ కనిపిస్తోంది.



లాక్‌డౌన్‌తో నిర్మానుష్యంగా మారిన నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్

## రీజనల్ కోవిడ్ ఆసుపత్రిగా నెల్లూరు ప్రభుత్వాసుపత్రి :

జనజీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్న కరోనాకి సంబంధించిన కోవిడ్-19 వైరస్ వ్యాప్తిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు నేతృత్వంలో అధికార యంత్రాంగం ముమ్మర చర్యలు తీసుకుంటోంది. నెల్లూరు నగరంలోని సర్వజన ఆసుపత్రిని రీజనల్ కోవిడ్ ఆసుపత్రిగా ఏర్పాటుచేస్తోంది. కడప, నెల్లూరుజిల్లాలను కలుపుతూ ఈ ఆసుపత్రి ఏర్పాటుకు అధికారయంత్రాంగం సమాయత్తమైంది. కరోనాకు సంబంధించిన కేసులను పరిశీలించేందుకు ఇక్కడ అదనంగా ఐసియు ఏర్పాట్లతో పాటు, వార్డులను సిద్ధం చేస్తున్నారు. 600 పడకలతో కరోనా ఐసొలేషన్ వార్డు ఏర్పాటుకు అధికారులు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. దీంతో పెద్దాసుపత్రి ఇకనుంచి పూర్తిగా కరోనా నివారణ ఆసుపత్రిగా మారిపోనుంది.

## నిత్యావసరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు :

కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రజలకు నిత్యావసరాలు, కూరగాయలు అందుబాటులోకి తెస్తూ జిల్లా అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంది. మంత్రి డా. అనిల్‌కుమార్‌యాదవ్ సూచనలతో నెల్లూరు నగరమంతటా 98 రైతుబజార్లను ఏర్పాటుచేశారు. జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తిల పర్యవేక్షణలో ఈ మార్కెట్లు గత నెల 27 నుంచి ప్రారంభమయ్యాయి. నెల్లూరు నగర నియోజకవర్గంలో 48, రూరల్ నియోజకవర్గంలో 50 వంతున రైతుబజార్లను ఏర్పాటుచేశారు. మునిసిపల్ పాఠశాలలు, ఖాళీ ప్రదేశాల్లో రైతులు కూరగాయల విక్రయాల కోసం షామియానాలు వేసి, వారికి వసతులు కల్పిస్తున్నారు.




పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 37 సంవత్సరాలు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారుడు - కోడలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి

మాజీ మంత్రివర్యులు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు

కుమార్తెలు - అల్లుళ్ళు

కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి

కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - | డా॥ సింధు | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రీతిక |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - | నీలిమ | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | - | డా॥ మాలిని | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - | స్నిగ్ధ | | |




# సిఆర్‌రెడ్డి హాస్పిటల్ ఐదు లక్షల విరాళం

సిఆర్‌రెడ్డి హాస్పిటల్ యాజమాన్యం ముందుకు వచ్చి కరోనా వైరస్ బాధితులకు సహాయం చేసేందుకు ఐదు లక్షల రూపాయలు అందజేయడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణకు ఐదు లక్షల రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న కరోనా వైరస్ మహమ్మారి వలన దేశ ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతింది. దీంతో ప్రజలు సీఎం సహాయనిధి మరియు ప్రధానమంత్రి సహాయనిధిలకు విరాళాలు అందజేస్తున్నారు. ఈ క్రమంలో గూడూరు పట్టణానికి చెందిన సిఆర్‌రెడ్డి హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ జనార్ధన్‌రెడ్డి ముందుకువచ్చి ఐదు లక్షల రూపాయల విరాళాన్ని గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ సిఆర్‌రెడ్డి హాస్పిటల్ యాజమాన్యం పెద్ద మనసుతో ఇంత పెద్ద మొత్తాన్ని విరాళంగా అంద జేయడం అభినందనీయమన్నారు.

డాక్టర్ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తమ హాస్పిటల్ ద్వారా గత 50 సంవత్సరాలుగా గూడూరు డివిజన్ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని, కరోనా వైరస్ వలన పేదప్రజల జీవితాలు అతలాకుతలమౌతున్నాయని, మావంతు సాయంగా ఐదు లక్షలు విరాళం అందజేయడం జరిగిందన్నారు. పట్టణంలో ఎంతోమంది దాతలు ఉన్నారని, వారు అందరూ ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని కోరుతున్నామన్నారు.

# పేదలకు పేర్నాటి కూరగాయలు



కరోనా వైరస్ కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో గూడూరు పట్టణ పరిధిలోని విఙ్ఞేశ్వర పురం, శారదానగర్ గిరిజన కాలనీ, పోటుపాలెం చలివేంద్ర గుంట, పురిటిపాలెం లోని పేద మరియు మధ్య తరగతి కుటుంబాలకు కూరగాయలను పంపిణీ చేసేందుకు పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ ముందుకొచ్చింది. ఈ క్రమంలో ఇటీవల పేర్నాటి యువసేన గూడూరు రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణారెడ్డి, గూడూరు రూరల్ సబ్‌ఇన్స్‌పెక్టర్ పుల్లారావు చేతుల మీదుగా కూరగాయలను పంపిణీ చేసింది.



కరోనాను అరికట్టడం కొరకు తనవంతు సహాయంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు మంత్రులు పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డి, గూడూరు శాసనసభ్యులు వరప్రసాద్‌రావుల చేతికి రూ.25,000/-ల చెక్‌ను ఇటీవల అందజేసిన గూడూరు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలత, కోడూరు మీరారెడ్డి.



2వేల మాస్కులను గూడూరు సబ్‌కలెక్టర్‌కు తమ వంతు సాయంగా ఇటీవల అందజేస్తున్న కనుమూరి హరిచంద్రా రెడ్డి ట్రస్ట్ సభ్యులు అనిల్, ప్రవీణ్, సాయి, సురేష్, శ్యాం, నారాయణ

# అప్రమత్తతే శ్రీరామరక్ష

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ నుంచి ప్రజలు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, అప్రమత్తతే శ్రీరామరక్ష అని మంత్రులు గౌతమ్‌రెడ్డి, డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. గత నెల 29న గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వైరస్‌ను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని అన్నారు. గూడూరు పట్టణంలోని ప్రైవేట్ కళాశాలల్లో 200 పడకలు ముందస్తుగా సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు, సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ,తో పాటు వైఎస్సార్సీపి నాయకులు



గూడూరు ప్రాంతీయ వైద్యశాలను పరిశీలిస్తున్న మంత్రులు అనిల్, గౌతమ్‌రెడ్డి

ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బత్తిన విజయకుమార్, కోడూరు మీరారెడ్డి, కోడూరు కల్పలత, బొమ్మిడి శ్రీనివాసులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# సరుకుల పంపిణీలో.. జాగ్రత్తలు పాటించాలి

### - తహశీల్దార్ లీలరాణిలి

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సరుకులను అందించే క్రమంలో రేషన్ డీలర్లు, వాలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గూడూరు తహశీల్దార్ లీలారాణి సూచించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్, తిలక్‌నగర్, అడవయ్య కాలనీ పరిధిలోని 54వ రేషన్‌షాపును ఆదివారం తహశీల్దార్ తనిఖీ చేశారు.

కరోనా వ్యాప్తి చెందకుండా ఏప్రిల్ 14 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ అమలు చేస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో పేదలకు ఏప్రిల్ నెలలో అందివ్వనున్న రేషన్ సరకులను ఆదివారం నుంచి అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బియ్యం కార్డు దారులకు సరుకులను రేషన్‌షాపుల ద్వారా అందిస్తున్నారు. గూడూరులో కూడా సరుకుల ప్రక్రియ ఆదివారం ఉదయం నుంచి ప్రారంభం అయ్యింది. ఉదయం 6గంటల నుంచి సరుకులను ప్రజలకు అందిస్తున్నారు. స్థానిక తిలక్‌నగర్‌లో ఉన్న రేషన్‌షాపును తహశీల్దార్ లీలారాణీ తనిఖీచేసి డీలర్‌కు పలు సూచనలు చేశారు. ప్రజలు సామాజిక దూరం పాటించేలా చూసుకోవాల



న్నారు. సరుకుల పంపిణీలో ఎలాంటి ఆటంకం కలగ కుండా చూడాలని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. వాలంటీర్లు తమ మ్యాపింగ్‌లో వున్న కార్డు దారులకు సరుకులు అందేలా చూడాలన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఇంటికి ఒక్కరు మాత్రమే వచ్చి సరుకులు తీసుకువెళ్లాలని సూచించారు. వేలిముద్రలు వేయడం నిషేధించడంతో స్థానిక వి.అర్.ఓల వేలిముద్రల ద్వారా సరుకుల పంపిణీ జరుతుందన్నారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పంపిణీ జరగనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. విఆర్‌ఓ దాసరి హనుమంతయ్య, విఆర్‌ఎ రాధాకృష్ణయ్య, సిబ్బంది, వాలంటీర్లు తదితరులున్నారు.

# పీహెచ్‌డీ అందుకున్న దివ్య



నెల్లూరు జిల్లా గూడూరు యస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలుగా పనిచేస్తున్న వై.దివ్య ద్రావిడ విశ్వ విద్యాలయం నుంచి ఇటీవల పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు అనువాద, అధ్యయనశాఖలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ యస్.చిన రెడ్డయ్య పర్యవేక్షణలో ఆత్రేయ నాటకాలు – వ్యాకరణ విశ్లేషణ అనే అంశంపై దివ్య పలు జాతీయ సదస్సులలో పత్ర సమర్పణ చేశారు. ఇందుకు గాను ఆమె పీహెచ్‌డీ పట్టాను పొందారు. ఈ సందర్భంగా యస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీనివాసమూర్తి ఆమెకు అభినందనలు తెలిపారు.

# కరోనా నివారణకు మాస్కులు, శానిటైజర్లు

కరోనా నివారణ చర్యల్లో నిరంతరం శ్రమిస్తున్న వైద్య సిబ్బందికి, పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి గతనెల 28న గూడూరు పట్టణ ప్రముఖుడు, ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు మాస్కులు అందజేశారు. అదేవిధంగా సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ వివిధ శాఖల అధికారులకు శానిటైజర్లను అందజేశారు. కరోనా నివారణకు ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ ఓబులేశు, ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, ఎంవిఐ మురళీమోహన్‌తో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మాస్కులు, శానిటైజర్లు అందజేస్తున్న ఎస్.రామ్మోహన్‌రావు



కరోన వైరస్‌పై సమరంలో భాగంగా, రిటైర్డ్ ఎస్.ఐ జనార్ధన్‌రెడ్డి గూడూరు టూటౌన్ పోలీస్ సిబ్బందికి మాస్కులు అందించి కరోనా వైరస్ కట్టడిలో పోలీస్ పాత్రను కొనియాడారు.

## ఢిల్లీ ప్రయాణీకులపై..

# నెల్లూరులో అప్రమత్తం

**- అధికారులతో మంత్రుల సమీక్ష**

15 రోజుల క్రితం నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు ఢిల్లీలో జరిగిన ఓ మతపరమైన కార్యక్రమానికి వెళ్లి తిరిగొచ్చిన ఘటనపై జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. విషయం తెలుసుకున్న అధికారులు వారి వివరాలను తెలుసుకొని క్వారయింటెన్ సెంటర్లకు తరలిస్తున్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా మంత్రులు అనీల్ కుమార్‌యాదవ్, మేకపాటిగౌతమ్‌రెడ్డిలు సోమవారం రాత్రి అధికారులతో అత్యవసర సమీక్షను నిర్వహించారు.

గోప్యంగా జరిగిన ఈ సమావేశానికి అధికారులను తప్ప ఇంకెవర్నీ ఆహ్వానించలేదు. మీడియాకు కూడా సమాచారం లేకుండా సమీక్ష నిర్వహించారు. సమీక్ష మొత్తం ఢిల్లీ ప్రయాణీకుల పైనే జరిగినట్లు సమాచారం. ఢిల్లీకి ఎంత మంది వెళ్లివచ్చారు... వారిలో ఎంతమందిని గుర్తించారు.... ఎవరెవర్ని క్వారయింటెన్ సెంటర్‌కు తరలించారు అనే విషయాలపై చర్చించినట్లు తెలిసింది. ఇంకా ఎంత మందిని గుర్తించాలి అనే విషయంపై కూడా అధికారులను మంత్రులు అడిగినట్లు సమాచారం. 24 గంటలో మిగిలిన వారిని క్వారయింటెన్ సెంటర్లకు తరలించాలని ఆదేశించినట్లు తెలిసింది. మొత్తం మీద ఢిల్లీ ప్రయాణీకులపై అధికారుల్లో ఆందోళన మొదలైనట్లు తెలుస్తుంది.

### ఇంతకీ ఏంటీ ఢిల్లీ పర్యటన...

ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో ఈనెల 13 నుండి 15వ తేదీ వరకూ మార్కజ్ ప్రార్ధనలు జరిగాయి. ఈ ప్రార్ధనలకు ఇండోనేషియా దేశం నుండే కాకుండా మన దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో పలువురు హాజరయ్యారు. నెల్లూరు జిల్లా నుండి 68 మంది హాజరయినట్లు గుర్తించారు. ప్రార్ధనలు ముగించుకుని ఇటీవలే వారి వారి స్వస్థలాలకు చేరుకున్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనేకమంది తిరుగు



ప్రయాణంలో ఒకే రైలులో ప్రయాణం చేశారు. అక్కడి నుండి వస్తూ రైలు ప్రయాణం చేసిన తెలంగాణాలోని 6మందికి కరోనా వైరస్ సోకింది. అలాగే అదే రైలో ప్రయాణించిన ఇద్దరు చీరాల వాసులు కూడా కరోనా బారిన పడ్డారు. ఢిల్లీ ప్రార్ధనలకు వెళ్లిన వారిలో అధిక శాతం మంది కరోనా బారిన పడ్డారు. అదే ప్రార్ధనలకు నెల్లూరు జిల్లా వాసులు 68 మంది వెళ్లి వచ్చారు. వారంతా నెల్లూరు, బోగోలు, నాయుడుపేట, గూడూరు, కొడవలూరు, అల్లూరు, వరికుంటపాడు, టి.పి.గూడూరు, వాకాడు, ఇందుకూరుపేట, వింజమూరు, ఓజిలి, సూళ్లూరుపేట, కోవూరు మండలాలకు చెందిన వారు.

# సామాజిక దూరం తప్పనిసరి

**- విబి సాయికృష్ణ యాచేంద్ర**

కరోనా మహమ్మారిని నియంత్రించేందుకు ప్రజలందరూ తప్పనిసరిగా సామాజిక దూరం పాటించాలని, అలా పాటించినప్పుడే ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ అలక్ష్యం చేయకూడదని వెంకటగిరి రాజకుటుంబీకుడు డా.విబి సాయికృష్ణ యాచేంద్ర వెంకటగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. గతనెల 29న ఆయన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సర్వజ్ఞకుమార యాచేంద్రతో కలసి వెంకటగిరిలోని ప్రభుత్వ జూనియర్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కూరగాయల దుకాణాల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. లాక్‌డౌన్ పరిస్థితుల దృష్ట్యా ప్రజలంతా ఇళ్ళలోనే ఉండాలని, బయటకు రావద్దని పదేపదే చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్సీపి కన్వీనర్ జి.ఢిల్లీబాబు, మాజీ కౌన్సిలర్ కె. రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఏకాకి

**- చిన్ని నారాయణరావు**
9440202942

మాట పరాయిదయిపోయింది
చేతులు చేతులు కలపాలన్నచోట
దూరమైతేనే బ్రతుకుగా ధ్వనిస్తోంది
కలసి ఉంటేనే కలదు సుఖం
సామాజిక దూరమైంది
పని మంత్రం మాసిపోయి
ఇంటి తంత్రతం వెల్లివిరుస్తోంది
బ్రతుకు భయం నిత్యస్తోత్రమయిపోయింది
ధృక్కులు మారి మనిషి ఇప్పుడు
దిక్కులు చూస్తున్నాడు
ఏ పామెప్పుడు కాటేస్తుందోనని
కళ్ళ రెప్పలు చాచి పుట్టల వంక చూస్తున్నాడు
ఏ దశలో కాలనాగు కాటేస్తుందో
ఏ దశలో ఎవరి ప్రాణం తీస్తుందో
'బూచి'లా ఆలోచనాలోచన
సముద్రుడవుతున్నాడు
మాటలు చెదిరి
మమతలు తరిగి
ఏకాకి అవుతున్నాడు
ఏకాఏకి జీవితానికి
బానిస అవుతున్నాడు.
అయితేనేం -
ఒంటరితనం అలవరచుకొన్న మనిషి
దూరానికి దగ్గరవుతున్నాడు
అతడే ఒక సైన్యంలా కనిపించని
శత్రువుపై పోరు సల్పుతున్నాడు
రేపటి సూర్యోదయానికి
చేరువవుతున్నాడు

శ్రీను గల్పిక

# ఆయనే ఉండుంటే.. కరోనా పరారే!

అది హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు ఇసుక, సిమెంట్, ఇటుకను తానే కలిపి కట్టిన హైదరాబాద్ నగరం. ఆ నగరంలో చంద్రబాబు నివాసం. చంద్రబాబుతో పాటు భువనేశ్వరిదేవి, లోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్, టిడిపి నాయకులు ఎన్.రమణ, పత్తిపాటి పుల్లారావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, దేవినేని ఉమామహేశ్వరరావు, జేసీ దివాకర్‌రెడ్డి వున్నారు. ఆరోజు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం కావడంతో లోకేష్ ఒక ఇనుప పైపు తెచ్చి దానికి పార్టీ జెండా కట్టి పైప్‌ను భూమిలో గుంత తీసి నిలబెట్టాడు. చంద్రబాబు జెండాను ఆవిష్కరించాడు. తర్వాత చంద్రబాబు వుండి అక్కడున్న వారితో... ఆంధ్ర ప్రదేశ్‌లో కరోనా వైరస్ పరిస్థితుల ప్రభావం ఎలా వుందని అడిగాడు. జేసీ దివాకర్‌రెడ్డి వెంటనే... రాష్ట్రంలో అసలు చడీచప్పుడే లేదయ్యా.. కరోనా మీద అసలు ప్రభుత్వం ఏం చేస్తుందో కూడా తెలియడం లేదు. అదే మీరున్నప్పుడు గాని ఈ కరోనా వైరస్ వచ్చుంటేనే దానిని కాలితో తన్ని పారిపోయేలా చేసుండే వాళ్ళు. ఏమైనా మీ బిల్డప్ అందరికీ రాదు బాబుగారూ అని చెప్పాడు. దేవినేని ఉమా అందుకుని... నిజమే సార్, ఇప్పుడు ఏపి ప్రజలకు, ముఖ్యంగా మీడియాకు మీరు లేని నోటు కనిపిస్తోంది. ఈ కరోనా వైరస్ వచ్చిన తరుణంలో మీరే గనుక సీఎంగా వుండుంటే ఆ వాతావరణమే వేరుగా వుండేదన్నాడు.

వారి మాటలకు చంద్రబాబు... ఏం చేద్దాంలే, ఎవరు చేసుకున్న ఖర్మకు వాళ్ళు అనుభవిస్తున్నారు, భరించాలి కదా, ఏపి జనాలను అనుభవించనీ అంటూ అక్కడ నుండి లేచి లాక్‌డౌన్ పాటిద్దాం, ఎవరిళ్లకు వాళ్ళు వెళ్లిపోండని చెప్పాడు. అక్కడే వున్న లోకేష్ వారు అన్న మాటలన్నీ విన్నాడు. డైనింగ్ టేబుల్ వద్దకెళ్లి భోజనం చేశాడు. ఆయన భోజనం కాగానే బ్రాహ్మణి వచ్చి ఒక బూజుకర్ర లోకేష్ చేతికిచ్చింది. ఏంటిది అని లోకేష్ అడిగాడు. బ్రాహ్మణి వుండి... బూజుకర్ర, ఇప్పుడు పనేమీ లేదు కదా, ఇంట్లో నుండి బయటకు కూడా పోయే అవకాశం లేక పోయే... పొద్దస్తమానం తిని కూర్చుంటే లావైపోతావ్... ఇంట్లో బూజు బాగా పట్టింది... అదంతా దులుపు, అలాగే షింక్‌లో గిన్నెలు ఎక్కువగా వున్నాయి, తర్వాత వాటిని కూడా కడిగి పెట్టు అని ఆర్డర్ వేసింది. లోకేష్ మనసులో... ఎంత ఒకవేళ మీరు పాలు, కూరగాయలు అమ్మి మమ్మల్ని పోషిస్తుంటే మాత్రం ఇంత చీప్‌గా చూడాలా.. అనుకుంటూ, మారు మాట్లాడకుండా బ్రాహ్మణి చెప్పిన పనులన్నీ చేశాడు. ఎప్పుడూ అలవాటు లేని పనులు చేయడంతో ఆయనకు ఒళ్లు పులిసిపోయింది. దీంతో లోకేష్ బెడ్ రూంలోకి వెళ్లి బెడ్ మీద వాలిపోయాడు. అంతకుముందు తన తండ్రి చంద్రబాబుతో జేసీ దివాకర్‌రెడ్డి, దేవినేని ఉమలు జరిపిన సంభాషణ గురించి ఆలోచిస్తూ అలాగే కళ్లు మూసుకున్నాడు.

★★★★★

అది ఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యాలయం. దేశాన్ని కరోనా వైరస్ కమ్మేసిన నేపథ్యంలో నరేంద్ర మోడీ కేబినెట్ సమావేశం పెట్టాడు. కేంద్ర మంత్రులంతా హాజరయ్యారు. అందరూ దూరదూరంగా కూర్చున్నారు. మోడీ వుండి మంత్రులతో... కరోనా వైరస్ తీవ్రత ఎక్కువవుతోంది, దీనిని అరికట్టాలంటే ఏం చేయాలో సలహాలివ్వండి అని కోరాడు. దానికి ప్రకాశ్ జవదేకర్ ఉండి... ఈ టైంలో మన దేశానికే కాదు, ప్రపంచానికి కూడా ఆయన సేవలు కావాలి. ఆయన సీఎంగా వుండుంటే ఎంతో బాగుండేది... ఈ కరోనాను కాలితో తన్ని కాటికి పంపించి వుండేవాడు అని అన్నాడు. ఎవరాయన అని నరేంద్ర మోడీ అడిగాడు. దానికి ప్రకాశ్ జవదేకర్... ఇంకెవరు సార్, మన చంద్రబాబునాయుడు. ఆయన సీఎంగా వుండుంటే ఈ పరిస్థితుల్లో ఆ హడావిడే వేరుగా వుండేది. దోమలపై దండయాత్ర లాగే 'కరోనాపై కత్తి దూసిన చంద్రబాబు' టైపులో పబ్లిసిటీ పీక్స్‌లో వుండేది. తెలుగు మీడియా కూడా ఈ కరోనా సమయంలో ఆయన సీఎంగా వుండుంటే... పండుగ చేసుకునేది. కరోనా పేషంట్లు వున్న వార్డులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసేవాళ్ళు, కనీసం ఓ పాతిక మంది డాక్టర్లు, 50 మంది పోలీసు అధికారులనన్నా సస్పెండ్ చేసేవాడు. ఆయన జిల్లా వ్యాప్తంగా పర్యటనలు జరిపేవాళ్ళు, కరోనాపై కన్నెర్ర జేసిన చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం అంటూ ప్రతి నగరంలో ఫ్లెక్సీలు పడేవి. పత్రికల్లో స్వాగత ప్రకటనలు వుండేవి. కరోనా ఆసుపత్రులలోనే ఆయన రాత్రి బస చేసేవాళ్ళు, కరోనా పేషంట్లకు ఆయనే మాత్రలు వేయడం, ఇంజక్షన్‌లు చేయడం కూడా చేసేవాడు. ఈ టైంలో ఆయన ఏపి సీఎంగా లేక పోవడంతో ప్రజలు, పత్రికల వాళ్ళు చాలా మిస్సయ్యారు అని చెప్పాడు. అప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వుండి... ఆయనను జాతీయ కరోనాపై కరాటే కమిటీకి ఛైర్మెన్‌గా నియమిస్తే బాగుంటుందేమో ఆలోచించండి అని సూచించింది. అంతలో మోడీ సెల్‌ఫోన్ మోగింది. మోడీ ఫోన్ ఎత్తాడు... అవతల నుండి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. మోడీ గారు... మా దేశంలో కరోనా వైరస్ తీవ్రంగా వుంది... దీనిని అరికట్టాలంటే మావల్ల కావడం లేదు. తుఫాన్‌లను అరచేతులతో ఆపిన ధీరుడు, సునామీలను కంటి చూపుతో శాసించిన సూరీడు చంద్రబాబునాయుడును మా దేశానికి పంపించగలరా... కరోనా వైరస్‌కు ఆయనైతేనే అడ్డుకట్ట వేయగలరు... అని బ్రతిమలాడుకున్నాడు. దానికి మోడీ... ఆయనను అడిగి, ఆయన ఒప్పుకుంటే అలాగే పంపిస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. తర్వాత మోడీకి వరుసగా ఇటలీ, ఇరాన్, స్పెయిన్, ఫ్రాన్స్ దేశాధినేతల నుండి కూడా ఫోన్‌లు వచ్చాయి. అందరు కూడా చంద్రబాబును తమ దేశానికి పంపించమని కోరసాగారు. ప్రపంచవ్యాప్తంగా చంద్రబాబుకు వున్న క్రేజ్‌ను చూసి మోడీయే ఆశ్చర్యపోసాగాడు. అంతలో బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ కూడా మోడీకి ఫోన్ చేసి... సార్, నాకు కూడా కరోనా వచ్చింది, ఈ టైంలో చంద్రబాబు వంటి వారి అవసరం నాకెంతో వుంది, ఓ రెండు నెలల పాటు మా దేశాన్ని పాలించడానికి ఆయనను ఇక్కడకు పంపండి సార్ అని కన్నీటితో వేడుకున్నాడు. ఆయన ఫోన్ పెట్టేశాక మళ్లీ మోడీ ఫోన్ మోగింది. అవతల నుండి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్... మోడీ గారు, మా దేశంలో ఇంతవరకు కరోనా లేదు, ఒకవేళ వచ్చినా వాళ్ళకు టాబ్లెట్‌తో కాకుండా బుల్లెట్‌తో ట్రీట్‌మెంట్ ఇస్తున్నాం... ఇలా ఎన్ని బుల్లెట్‌లని వాడగలం... మా దేశంలోకి కరోనా రాకుండా చేయగల సామర్థ్యం మీ చంద్రబాబుకే వుంది. ఆయనను మా దేశం పంపించండి అని కోరాడు. మోడీ అందుకు... ఆయన ఒప్పుకుంటే అలాగే పంపిస్తానని చెప్పాడు.


ఆ మాట వినగానే... ఆ దేశానికి మాత్రం వద్దు... ఆ దేశానికి వద్దు అంటూ కేకలు వినిపించసాగాయి. భువనేశ్వరి, బ్రాహ్మణిలు పరుగెత్తుకుంటూ లోకేష్ బెడ్‌రూంలోకి వచ్చారు. "నాన్నారు, ఆ దేశానికి వద్దు' అంటూ నిద్రలో కలవరిస్తున్న లోకేష్ మొహంపై నీళ్లు కొట్టారు. ఆ దెబ్బతో లోకేష్‌కు నిద్రమత్తు వదిలింది. అప్పటిదాకా జరిగిందంతా కల అని తెలుసుకునేసరికి ఆయన మనసు కుదుటపడింది.

# ఎందరో వదాన్యులు.. అందరికీ వందనాలు

- కరోనా నిరోధానికి టాటా విరాళం 1500 కోట్లు
- విప్రో సాయం 1125 కోట్లు
- దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న దాతృత్వం
- మేమున్నామంటూ.. ప్రజలకు భరోసా







**కరోనా మహమ్మారి వ్యాధిని తరిమికొట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న సమరానికి తోడుగా తమవంతు ఆర్థిక సాయం అందిస్తూ ఎందరో దాతలు తమ దాతృత్వాన్ని ప్రకటించి ప్రజల అభినందనలు అందుకుంటున్నారు. మానవాళినే గడగడలాడిస్తున్న ఈ వైరస్‌ను నిరోధించే కార్యక్రమంలో భాగంగా, ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి తమవంతు సేవలందించేందుకు దేశవ్యాప్తంగా ప్రతిప్రాంతంలోనూ ఎందరో దాతలు ముందుకు వస్తున్నారు. ఎందరో వదాన్యులు..అందరికీ వందనాలు!...**

కరోనా మహమ్మారి ప్రపంచాన్నే వణికిస్తున్న నేపథ్యంలో దేశంలోనూ ఆ వ్యాధికి చెందిన కోవిడ్-19 వైరస్ వ్యాప్తి చెందుతుండడంతో, దాని నిరోధించి ప్రజలను కాపాడుకునేందుకు ప్రధాని మోడీ సారథ్యంలో కేంద్రప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోంది. ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ ఆ వ్యాధిని నిరోధించేందుకు ఉన్న అన్ని మార్గాలనూ అనుక్షణం అన్వేషిస్తూ కరోనాను తరిమికొట్టేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోంది. వివిధ పథకాల కింద ప్రజల సంక్షేమం కోసం లక్షలాది కోట్ల రూపాయలను ప్రభుత్వాలు వెచ్చిస్తున్నాయి. ఒకవైపు కరోనా నిరోధానికి సమస్త చర్యలు తీసుకుంటూనే మరోవైపు ప్రజల ఆరోగ్యరక్షణ కోసం, ప్రజల రోజువారీ జీవితంలో ఇబ్బందులు లేకుండా చూడడం కోసం కేంద్రప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలన్నీ కంటికి కునుకు లేకుండా శ్రమిస్తూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. కరోనా వైరస్‌ను తరిమికొట్టేందుకు ప్రజలందరూ సహకరించాలని ప్రధాని మోడీ సూచనకు ప్రజలు తక్షణం స్పందిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ళలోనే ఉంటూ స్వీయనిర్బంధం పాటిస్తూ ఈ మహమ్మారి వైరస్‌కు దూరంగా ఉంటున్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్యసిబ్బందితో పాటు ఆయా రాష్ట్రాల్లో అధికారులు, పోలీసు యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధసంస్థలు, సమాజసేవాభిలాషులు అంతా కలసి కరోనాను కట్టడి చేసేందుకు అహరహం శ్రమిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపి ప్రభుత్వం కూడా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రప్రజలకు అండదండగా నిలుస్తూ కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రజల్లో నిరంతరం అవగాహన కలిగిస్తోంది. సామాజిక దూరం పాటించడం, ప్రతిఒక్కరూ ఇళ్ళలోనే ఉండి ఆ వ్యాధికి దూరంగా ఉండడం ద్వారా వ్యాధిని నియంత్రించుకోవడం అత్యవసరమని ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో సాధారణ, నిరుపేద ప్రజలకు ఈ కష్టకాలంలో ఇబ్బందులు లేకుండా తమవంతు సాయం అందించేందుకు దేశవ్యాప్తంగా అనేకమంది ధనవంతులు, అదేవిధంగా దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ ఉన్న దాతలు, సమాజసేవకులు తమవంతు సేవలందిస్తున్నారు. కరోనా నియంత్రణకు ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో కరోనాను ఎదుర్కొనేందుకు సమరం సాగిస్తూనే మరోవైపు ప్రజలను, ముఖ్యంగా నిరుపేదలను ఆదుకునేందుకు దాతలు అన్నివిధాలా తమవంతు సాయం అందిస్తుండడం ఎంతైనా అభినందనీయం. ఎందరో వదాన్యులు.. వారందరికీ ఈ సందర్భంగా 'లాయర్' ముకుళిత హస్తాలతో అభివందనాలు చెప్తోంది.

### టాటా విరాళం..1500 కోట్లు

కరోనా వల్ల దేశం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో కరోనాపై పోరు సాగించేందుకు దేశంలోని ప్రఖ్యాతమైన టాటా సంస్థ మానవతా హృదయంతో స్పందించింది. దేశప్రజల ఆరోగ్యం కోసం కేంద్రప్రభుత్వానికి 1500 కోట్ల రూపాయల విరాళాన్ని ఇచ్చి ఆ సంస్థ అందరి ప్రశంసలు అందుకుంటోంది. టాటా సంస్థ తరపున 500 కోట్లు, టాటా సన్స్ సంస్థ తరపున 1000 కోట్ల రూపాయల భూరి విరాళాన్ని అందజేసి ఆ సంస్థల అధినేతలు రతన్ టాటా, ఎన్. చంద్రశేఖర్‌లు దేశ ప్రజల అభినందనలు అందుకుంటున్నారు.

### జిందాల్, అదానీ సంస్థలు వందకోట్ల వంతున విరాళం

కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు మనదేశం సాగిస్తున్న అలుపెరుగని పోరాటంలో కరోనాను ఎదుర్కొనేందుకు దేశంలోని మరో రెండు ప్రముఖ సంస్థలైన జిందాల్ (జెఎస్‌డబ్ల్యు) సంస్థ ప్రధాని సహాయనిధికి వంద కోట్ల రూపాయల విరాళం ప్రకటించింది. తమ సంస్థ సిబ్బంది ఒక రోజు వేతనాన్ని విరాళం అందజేస్తున్నట్లు ఆ సంస్థ యాజమాన్య ప్రతినిధులు పేర్కొన్నారు. బళ్ళారి జిల్లాలోని తోరణగల్లు వద్ద ఉన్న జిందాల్ సంస్థ గ్రూప్ అధ్యక్షుడు సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ కరోనా మహమ్మారిపై పోరుకు అవసరమైతే మరిన్ని నిధులు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించడం ఎంతైనా అభినందనీయం. అదేవిధంగా దేశంలోని సుప్రసిద్ధమైన అదానీ గ్రూప్ సంస్థ గౌతమ్ అదానీ తమవంతుగా ప్రధాని సహాయనిధికి వందకోట్ల రూపాయలు విరాళం ఇస్తున్నట్లు ప్రకటించడమే కాక, అవసరమైతే మరింత మొత్తాన్ని కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ వారు ప్రకటించి ప్రజలందరి అభినందనలు అందుకున్నారు.

### విప్రో సాయం.. 1125 కోట్లు

కరోనా వ్యాధి విజృంభణతో దేశంలో నెలకొన్న అసాధారణ ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ దిగ్గజం విప్రో లిమిటెడ్ సంస్థ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్‌ల తరపున 1125 కోట్ల రూపాయలను కేటాయించామని, దేశంలో దయనీయంగా ఉన్న ప్రాంతాల్లో వైద్యఆరోగ్య పరిస్థితుల్ని మెరుగుపరచేందుకు ఆ మొత్తాన్ని ఖర్చు చేస్తామని ఆ సంస్థ ప్రకటించింది.

అదేవిధంగా, కరోనాపై చేస్తున్న యుద్ధంలో ప్రభుత్వానికి బాసటగా ఎంతోమంది దాతలు తమ దాతృత్వాన్ని మానవత్వాన్ని చాటుకుంటూ పెద్దఎత్తున విరాళాలు అందజేస్తున్నారు. దీంతో ప్రధాని సహాయనిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. కరోనాపై చేస్తున్న యుద్ధంలో ప్రభుత్వానికి తమవంతు సాయంగా రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుతో పాటు అనేకమంది కేంద్ర మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు, కార్పొరేట్ సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు, వ్యక్తిగతంగా కూడా ఎందరో దాతలు దేశంలోని ప్రతిప్రాంతంలోనూ తమవంతు విరాళాలు అందజేస్తుండడం వారి మానవతా హృదయానికి నిదర్శనం. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఒకనెల వేతనాన్ని విరాళంగా ఇచ్చి తన సేవాభావాన్ని చాటుకున్నారు. దేశాన్ని రక్షించే పారామిలిటరీ సిబ్బంది కూడా తమవంతు సాయంగా ఒక రోజు వేతనం సుమారు 116 కోట్ల రూపాయలను విరాళంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు అందించడం ఎంతైనా అభినందనీయం.. అభివందనీయం కూడా. పిఎం సహాయనిధికి ఎల్‌ఐసి 105 కోట్లు, ఎస్‌బిఐ 100 కోట్లు విరాళంగా ప్రకటించాయి. కాగా, కరోనాపై పోరుకు దేశవ్యాప్తంగా క్రీడాలోకం కూడా తనవంతు సాయంగా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు విరాళాలు అందిస్తోంది. ప్రముఖ క్రికెటర్, భారత క్రికెట్ వన్‌డే జట్టు వైస్‌కెప్టెన్ రోహిత్‌శర్మ 80 లక్షల విరాళం ప్రకటించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.

### రామోజీ గ్రూప్ సంస్థల విరాళం 20 కోట్లు :

కరోనాపై పోరుకు హైదరాబాద్‌లోని రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మెన్ రామోజీరావు 20 కోట్ల రూపాయల విరాళం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు పదికోట్ల రూపాయల వంతున ఈ విరాళం అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. కరోనా నేపథ్యంలో జనజీవనం స్తంభించిపోయిన ప్రస్తుత తరుణంలో ఈనాడు, ఈటీవీ, ఈటీవీ భారత్‌లో ప్రజాచైతన్యం కోసం తమవంతు కృషిచేస్తున్నాయని, కరోనా కట్టడికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సారథ్యంలో జరుగుతున్న ఈ పోరాటంలో ప్రజలు విజయం సాధించాలని, ఉభయరాష్ట్రాలు ఆయురారోగ్యాలతో విలసిల్లాలని రామోజీరావు ఆకాంక్షను వ్యక్తం చేశారు.

అలాగే దేశంలో ఎప్పుడు ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినా మేమున్నామంటూ ముందుకు వచ్చే బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ సనీ పరిశ్రమ సైతం ఈ కరోనా వైరస్ విపత్తు వేళలో తమ పాత్ర పోషించాయి. బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ 25కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించడం తెలిసిందే! ఆయనలాగే ఎందరో సినీ ప్రముఖులు భారీ విరాళాలు అందించారు.

ఇలా... ఎందరో వదాన్యులు వంద రూపాయల నుండి 100కోట్ల వరకు ఉదారంగా విరాళాలు ప్రకటిస్తున్నారు.

---


లాక్‌డౌన్ పరిస్థితులపై...

## డ్రోన్ కెమెరాలతో నిఘా

జిల్లాలో లాక్‌డౌన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు చిత్రీకరిస్తూ, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశారు అధికారులు. ఇందుకోసం మొబైల్ టీమ్‌లను కూడా నియమించారు. కరోనా వ్యాధి వ్యాప్తికాకుండా 144 సెక్షన్‌తో పాటు, జిల్లాలో లాక్‌డౌన్ అమలులో ఉండడంతో వీటి అమలును పటిష్టంగా నిర్వహించేందుకు జిల్లా అధికారయంత్రాంగం పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా డ్రోన్ కెమెరాల వ్యవస్థను సమాయత్తం చేశారు. జిల్లాలోని నెల్లూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు, నాయుడుపేట డివిజన్‌లకు రెండేసి వంతున పది మొబైల్‌టీమ్‌లను ఏర్పాటుచేశారు. ప్రతి టీమ్‌లోనూ డ్రోన్ ఆపరేటర్‌తో పాటు ఒక అధికారి కూడా ఉంటారు. ప్రతిరోజూ ఆయా డివిజన్ల పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాల్లో లాక్‌డౌన్ పరిస్థితులను చిత్రీకరిస్తున్నారు. ప్రతిరోజూ డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించిన పుటేజీని ఆయా డివిజన్‌ల సబ్‌కలెక్టర్లకు, ఆర్డీఓలకు అందజేస్తున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు కూడా ఆ విషయాలను వివరిస్తున్నారు. ఇందుకోసం నెల్లూరు నగరంలోని జడ్పీ కార్యాలయంలో ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటుచేసి, డిఆర్‌ఓ మల్లికార్జున ఆధ్వర్యంలో, నుడా వీసీ బాపిరెడ్డి తదితరులు నిత్యం డ్రోన్ కెమెరాల వ్యవస్థను పరిశీలిస్తున్నారు.

## నిమ్మ రైతు.. కంట నీరు

- మార్కెట్ల మూతతో రైతన్న కుదేలు
- కొనుగోళ్ళు లేక చెట్లమీదే ఎండిపోతున్న నిమ్మ



కరోనా దెబ్బకు నిమ్మరైతులు అల్లాడిపోతున్నారు. ఈ భయంకరమైన వ్యాధి నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో నిమ్మపంటకు ప్రధానమైన గూడూరు, పొదలకూరు మార్కెట్లు మూతపడడంతో నిమ్మకాయల కొనుగోళ్ళు పూర్తి స్థాయిలో నిలిచి పోయాయి. దీంతో కొనుగోలు చేసేవారు లేక రైతులు తోటల్లో చెట్టమీదనే నిమ్మ కాయలు పండిపోయి.. ఎండిపోయి రాలి పోతుండడంతో రైతులు కంట నీరు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా గూడూరు, పొదలకూరు, రాపూరు పరిసరప్రాంతాల్లో వేలాది ఎకరాల నిమ్మతోటలు ఉన్నాయి. నిమ్మకు ప్రధాన ప్రాంతమైన గూడూరు నుంచే రోజుకు కనీసం వంద టన్నుల దాకా నిమ్మకాయలు దిగుబడి ఉంటుంది. ఇక్కడి నుంచి ఉత్తరాంధ్ర ప్రాంతాలకు, దక్షిణాది రాష్ట్రాలకు నిమ్మకాయలు ఎగుమతి అవుతుంటాయి కూడా. కాయల సైజును బట్టి మార్కెట్లో డిమాండ్‌ను బట్టి నిమ్మ వ్యాపారం బాగానే సాగుతుండేది.

అయితే, కరోనా వ్యాధి నిరోధకచర్యల్లో భాగంగా జిల్లా అంతా లాక్‌డౌన్ కావడంతో మార్కెట్లు మూతబడి నిమ్మకాయలు కొనేవారు బాగా తగ్గిపోవడంతో తోటల్లో కాయలు తోటల్లోనే రాలిపోతున్నాయి. నిమ్మకాయలు అమ్ముకునేందుకు తగు వసతులు, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో నిమ్మరైతులు పండిన పంటనంతా ఏమిచేసుకోవాలో అర్థం కాక ఆవేదనలో ఉన్నారు.

# రానున్న రోజులు ఎంతో కీలకం

**- మంత్రి గౌతమ్‌రెడ్డి**



కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో రానున్న రెండు వారాలు అత్యంత కీలకమని, ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, అందుకు తగ్గట్టుగా ప్రజలు కూడా సహకరించాలని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అన్నారు. ఈనెల 1న ఆయన ఆత్మకూరులోని ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమై కరోనా వైరస్‌పై సమీక్షించారు. గడిచిన పదిరోజుల వ్యవధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు లాక్‌డౌన్‌ను అమలుచేసి ప్రజల సహకారంతో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టగలిగామన్నారు. ప్రజలందరూ సామాజిక దూరం పాటించాలని, ఎవరి ఇళ్ళలో వారు ఉంటూ కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి సహకరించాలని ఆయన కోరారు. ఢిల్లీ ఘటనతో గత రెండు రోజులుగా రాష్ట్రంలో కరోనా కేసులు అధికం కావడంతో రాష్ట్రప్రభుత్వం వెంటనే అప్రమత్తమై క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, వలంటీర్ల సాయంతో వ్యాధి నిరోధక చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో కరోనా వైరస్ నివారణకు తీసుకుంటున్న చర్యలను మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. లాక్‌డౌన్ ప్రకటించివున్న నేపథ్యంలో రైతులు పండించిన ఉత్పత్తుల రవాణాకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అధికారులు సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. వ్యవసాయ పంట ఉత్పత్తుల రవాణాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, రైతులకు అవగాహన కలిగించి వారి వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు సహకరించాలని ఆయన కోరారు.

## కోవిడ్‌ను 15 నిమిషాల్లోనే నిర్ధారించే యంత్రాలు

రాష్ట్రంలో కరోనా వైరస్ పరీక్షా కేంద్రాలు ఇప్పుడు నాలుగు ఉన్నాయని, మరో మూడు కేంద్రాలు త్వరలో రానున్నాయని మంత్రి గౌతమ్‌రెడ్డి ఈ సందర్భంగా అధికారులకు తెలియజేశారు. జర్మనీ సహకారంతో, కేవలం 15 నిమిషాల్లోనే కరోనా వైరస్‌ను నిర్ధారించే యంత్రాలు కూడా త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ ఉమాదేవి, డిఎస్పీ మక్బూల్, నియోజకవర్గ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకట కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిహెచ్ఎస్‌పై బదిలీ వేటు

నెల్లూరులోని డిసిహెచ్ఎస్ సుబ్బారావుపై బదిలీ వేటు పడింది. ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి సివిల్‌సర్జన్‌గా ఆయన్ను బదిలీచేస్తూ, ఆత్మకూరులో పనిచేస్తున్న డాక్టర్ చెన్నయ్యను డిసిహెచ్ఎస్‌గా నియమిస్తూ కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు ఈనెల1న ఉత్తర్వులు జారీచేశారు. కరోనా నేపథ్యంలో క్వారంటైన్, ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేయడం, వాటికి అవసరమైన పరికరాలను, ఆయా వార్డుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బందికి అవసరమైన భద్రతా పరికరాలను సేకరించడం తదితర పనులను ఆయనకు అప్పగించగా విధుల నిర్వహణలో ఆయన సమర్థవంతంగా పనిచేయడం లేదని కలెక్టర్ ఈ చర్య తీసుకున్నారని సమాచారం.

# లాక్‌డౌన్‌కు.. బ్రేక్‌డౌన్

(మొదటి పేజీ తరువాయి)

130కోట్ల మంది భారతీయుల త్యాగం, లక్షలాదిమంది వైద్యులు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, స్వచ్ఛంద సేవకుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరయ్యింది.

చైనాలోని వూహాన్ నగరంలో పుట్టిన కరోనా వైరస్ క్రమంగా అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టి అన్ని దేశాలకు పాకడం తెలిసిందే! ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వైరస్ మనిషి నుండి మనిషికి పాకదు అని ఇచ్చిన అభిప్రాయాన్ని నమ్మి భారత ప్రభుత్వం ఈ వైరస్‌ను తొలుత సీరియస్‌గా తీసుకోలేదు. అయితే ఆ తర్వాత మొదట కేరళలో కరోనా పాజిటివ్ బయటపడడం, ఆ తర్వాత అక్కడక్కడా కేసులు వెలుగు చూస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 130 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో ఉన్నట్లుండి లాక్‌డౌన్ ప్రకటించడం అంటే మాటలు కాదు. కాని ఈ వైరస్‌తో ప్రమాదాన్ని పసిగట్టిన ప్రధాని నరేంద్ర మోడీ దేశమంతటా మూడు వారాల పాటు లాక్‌డౌన్ ప్రకటించారు. అంతర్జాతీయ, జాతీయ విమానాలను నిలిపేశారు. మార్చి 22 నుండి లాక్‌డౌన్ అమలులో వుంది. విదేశాల నుండి వచ్చిన వారిని క్వారంటైన్‌లో వుంచుతూ కేసులు భారీ సంఖ్యలో పెరగకుండా చూస్తూ వచ్చారు. ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లో కరోనా పాజిటివ్‌ల సంఖ్య చాలా తక్కువుగా వుంటూ వచ్చింది. 22వ తేదీ నుండి రెండు వారాలకే కేసులు అదుపులోకి వచ్చే పరిస్థితి... ఇదే జరిగివుంటే ప్రపంచంలో ఈరోజు భారత్ ప్రతిష్ట ఇంకోరకంగా వుండేది. అమెరికా లాంటి అగ్ర దేశాలు సాధించలేని కరోనాపై విజయాన్ని భారత్ అందుకోగలిగి వుండేది.

కాని, నిజాముద్దీన్ మర్కత్ మత సదస్సులు ఆ విజయాన్ని బ్రేక్ చేసాయి. ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి వణికిస్తున్న తరుణంలో వేలాది మందితో ఇక్కడ మత సదస్సులు నిర్వహించారు. మార్చి 1వ తేదీ నుండి ఇక్కడ జరుగుతున్న సదస్సులకు దేశంలోని 18 రాష్ట్రాలలో అన్ని ప్రాంతాల నుండి ముస్లింలు హాజరయ్యారు. అయితే మార్చి నెలారంభంలో వైరస్ తీవ్రత అంతగా లేదు. రెండో వారంలో కొంత ప్రమాద హెచ్చరికలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం సభలు, సమావేశాలు, వివాహాల వంటి కార్యక్రమాలపై ఆంక్షలు విధించింది. షాపింగ్ మాల్స్‌ను, సినిమా హాళ్ళ వంటి ప్రజలు గుమికూడే వాటిని మూసేయాలని ఆదేశించింది. మతపరమైన కార్యక్రమాలను కూడా పరిమితం చేయాలని సూచించడం జరిగింది. దేశ వ్యాప్తంగా అన్నీ పర్యవేక్షించారు గాని దేశ రాజధానికి కూతవేటు దూరంలో నిజాముద్దీన్ ప్రాంతంలో కరోనా వైరస్ ఉత్పత్తి కర్మాగారం ఏర్పడుతుందన్న విషయాన్ని పసిగట్టలేకపోయారు.

### విదేశీయులతోనే వైరస్

నిజాముద్దీన్ మర్కత్ సదస్సులకు దేశ వ్యాప్తంగా 10వేల మంది దాకా హాజరయినట్లు అంచనా! అయితే ఇంతమంది వెళ్లినా పెద్ద ప్రమాదముండదు. కాని, ఇండోనేషియా, మలేషియా, కజకిస్థాన్ వంటి దేశాల నుండి వందల సంఖ్యలో ప్రతినిధులు వచ్చారు. వీరంతా టూరిస్ట్ వీసాల మీద ఇండియాకొచ్చి నిజాముద్దీన్ మర్కత్ సదస్సులో పాల్గొన్నారు. వీరిలో చాలామందికి కరోనా పాజిటివ్ వుండడం, వారి ద్వారా ఆ సభకు హాజరైన వారికి అంటుకోవడం జరిగింది.

### ఇంటలిజన్స్ వైఫల్యమా?

కరోనా వైరస్ దెబ్బకు ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు పవిత్ర క్షేత్రంగా భావించే సౌదీ అరేబియాలోని మక్కా మసీదు వద్దే ఆంక్షలు పెట్టారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానాన్నే మూసేశారు. ఇలాంటి సమయంలో నిజాముద్దీన్ మత సదస్సులకు అసలు ఎవరు అనుమతినిచ్చారు? అసలు ఇంటలిజన్స్ ఏమైంది...? దేశంలో అడుగుపెట్టిన ప్రతి ప్రవాస వ్యక్తిని జల్లెడపట్టి క్వారంటైన్‌లో పెట్టారు. అలాంటిది ఇక్కడ విదేశాల నుండి వచ్చిన వాళ్ళు వందల సంఖ్యలో పోగైవుంటే అసలు నిఘా వర్గాలు ఎందుకు పసిగట్టలేకపోయాయి? ఇక్కడకు విదేశీయులు వచ్చిన విషయాన్ని ముందుగానే తెలుసుకుని జాగ్రత్తలు తీసుకుని వుంటే ఈరోజు దేశం ఇంతటి ప్రమాదకర స్థితిలో వుండేది కాదు.

### గుండెలపై కుంపట్లు

నిజాముద్దీన్ మర్కత్ బాంబు పేలనంత వరకు అన్ని రాష్ట్రాలలో కరోనా పాజిటివ్ కేసులు తక్కువుగానే వున్నాయి. కొన్ని రాష్ట్రాలలో అసలు కేసులే నమోదు కాలేదు. నిజాముద్దీన్ వైరస్ బాంబు పేలడంతో అన్ని రాష్ట్రాలలోనూ కరోనా పాజిటివ్ కేసుల్లో వేగం పెరిగింది. దేశ వ్యాప్తంగా కేసులు వూపందుకున్నాయి. మృతులు పెరిగారు. ఈ సంఘటన వెలుగులోకి రాకముందు వరకు లాక్‌డౌన్‌తో మంచి ఫలితాలే సాధించామని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎప్పుడైతే నిజాముద్దీన్ బాంబు పేలిందో అప్పటి నుండే అందరి గుండెల్లో రైళ్లు పరుగులు తీయసాగాయి.

దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్ని జిల్లాలు, అన్ని మండలాల నుండి నిజాముద్దీన్ మర్కత్‌కు వెళ్లి వున్నారు. వీళ్లంతా వచ్చి తమ కుటుంబ సభ్యులతో, తమ ప్రాంతాలలో తిరిగారు. వీరి మూలంగా ఎన్ని కేసులు వెలుగు చూస్తాయోననే ఆందోళన దేశ వ్యాప్తంగా నెలకొంది. ఇండియా మరో ఇటలీ కాకూడదని ప్రజలంతా కోరుకుంటున్నారు.

# ప్రమాదం ముంగిట ప్రపంచం



*ఏ ఒక్క దేశమైనా ఈ పరిస్థితిని ఊహించిందా? ఏ ఒక్క నిఘా సంస్థ అయినా ఈ దుస్థితిని పసిగట్టిందా? కంటికి కనిపించని ఒక సూక్ష్మజీవి ఈరోజు ప్రపంచాన్నే లాక్‌డౌన్ చేసింది. ప్రపంచ దేశాలలోని కోట్లాదిమంది ప్రజలను ఇళ్లల్లో కూర్చోబెట్టింది.*

ఈరోజు ప్రపంచమే ప్రమాదం ముంగిట్లో వుంది. చైనా సృష్టి సరోనా వైరస్ భూగోళంపై 200కుపైగా దేశాలకు పాకింది. దీని దెబ్బకు పెద్దదేశాలు, పేద దేశాలు అన్న తేడా లేకుండా అన్ని దేశాలూ వణికి చస్తున్నాయి. ఒక పక్క ప్రాణ నష్టం... ఇంకోపక్క ఆర్థిక నష్టం... ప్రపంచమే కోలుకోలేనంతగా ప్రభావం చూపిస్తోంది.

కరోనా వైరస్ ధాటికి అగ్రరాజ్యం అమెరికా అల్లకల్లోలమైంది. ఆ దేశం ఎప్పుడూ చవిచూడని ప్రాణనష్టం, ఆర్థిక నష్టాలను చవిచూస్తోంది. ప్రపంచంలో కరోనా వైరస్ కేసులలో అమెరికా అగ్రస్థానంలో దూసుకుపోతోంది. ఇక ఇటలీలో అయితే రోజూ మృత్యుఘోషే... రోజుకు వేల సంఖ్యలో మరణాలు చేరుతున్నాయి. కోవిడ్ దెబ్బకు ఇటలీ కోలుకోవడానికి ఎన్నేళ్లు పడుతుందో తెలియని పరిస్థితి. స్పెయిన్ కకావికలమైంది. కేసుల నమోదు వేగంగా పెరుగుతోంది. మరణాల సంఖ్య వేలల్లో వుంది. ఫ్రాన్స్, ఇరాన్, నెదర్లాండ్స్, బ్రెజిల్, అర్జెంటినా, జర్మనీ, జపాన్... ఇలా ప్రపంచ దేశాలన్నీ కరోనాతో కల్లోలంగా మారాయి.

ఈ వైరస్ ధాటికి ధనికులు కూడా దివాళా తీసే పరిస్థితులొచ్చాయి. ఎన్నో దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిపోనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కూడా పెను ఆర్థిక సంక్షోభం తలెత్తబోతోంది.

# గుండె గుభేల్!

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఉదయం ఇద్దరికి, గురువారం సాయంత్రానికి 18 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఒక్కసారిగా నెల్లూరుజిల్లా స్వరూపమే మారిపోయింది. రాష్ట్రంలో కేసులు తక్కువుగా వున్న జిల్లాగా జాబితాలో అడుగున ఉన్న నెల్లూరు ఒక్కసారిగా పైకి ఎగబాకింది. ఇంకా ప్రమాదమేంటంటే... 213 మంది రిపోర్టులు ఇంకా రావాల్సి వుంది. 40 మందికి పరీక్షలు చేస్తేనే.. 17 మందికి పాజిటివ్‌గా వచ్చింది, నిజాముద్దీన్‌కు వెళ్లి వచ్చిన ఏ జిల్లాలోని వారిలోనూ ఇంత శాతం పెరుగుదల లేదు. ఒక్క నెల్లూరుజిల్లాలో మాత్రమే అక్కడకు వెళ్లినవారిలో ఎక్కువ మందికి పాజిటివ్‌గా తేలింది. నెల్లూరు నగరంలో కోటమిట్ట, జనార్ధన్‌రెడ్డి కాలనీ, కొత్తూరు, మూలాపేట, రంగనాయకుల పేటలలో కేసులు బయటపడ్డాయి. ఇప్పటికే నగరంలోని 42, 43 డివిజన్‌లను రెడ్‌జోన్ క్రింద ప్రకటించి ఉన్నారు. ఇప్పుడు మిగతా ప్రాంతాలను కూడా రెడ్‌జోన్‌లోకి చేర్చారు.

నిజాముద్దీన్ మర్కత్ లింక్ మూలంగా కరోనా వైరస్ గ్రామాలకు కూడా పాకింది. నాయుడుపేటలో 4పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. అలాగే బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని రేబాల, కోవూరు, బోగోలు, కావలి, ఇందుకూరుపేటలలోనూ కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూడడంతో అక్కడంతా టెన్షన్ నెలకొంది. ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్న పరిస్థితి.


ఏప్రిల్ 1వతేదీ దాకా నెల్లూరుజిల్లా సేఫ్‌జోన్‌లో ఉండింది. అన్ని జిల్లాల్లో కేసులు పెరిగినప్పటికీ నెల్లూరుజిల్లాలో మాత్రం 2కేసులు మాత్రమే బయటపడ్డాయి. అయితే 2వ తేదీ ఉదయానికి సీన్ మారిపోయింది. ఒక్కసారిగా 18 పాజిటివ్ కేసులు రావడంతో నెల్లూరుజిల్లా డేంజర్‌జోన్‌లో పడిపోయింది. ఇక మిగిలిన 213 మంది రిపోర్టులు వస్తే ఎన్ని పాజిటివ్‌లు వస్తాయోననే ఆందోళన వెంటాడుతోంది. అంతేకాకుండా, వీరి మూలంగా ఇంకెంతమందికి వైరస్ సోకిందోననే భయం కూడా జిల్లా ప్రజలను వెంటాడుతోంది.

# ఢిల్లీ కుంపటి

(మొదటి పేజీ తరువాయి)

మార్చి31 వరకు ఏపి, తెలంగాణలలో చాలా తక్కువ సంఖ్యలోనే కేసులు బయటపడ్డాయి. అప్పటివరకు నిజాముద్దీన్ లింకు కేసులు బయటకు రాలేదు. అయితే అక్కడకు పోయి వచ్చిన వాళ్లలో క్రమంగా పాజిటివ్ లక్షణాలు బయటపడసాగాయి. దీంతో రెండు రాష్ట్రాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. రెండు రాష్ట్రాలలో కేసులు ఒక్కసారిగా పెరగసాగాయి. దీంతో ఢిల్లీ సదస్సుకు వెళ్లొచ్చిన వాళ్లెవరూ, వారు ఎక్కడెక్కడ ప్రయాణించారు, ఎవరిని కలిశారు అన్నది ఆరాతీసి అందరినీ క్వారంటైన్‌కు పంపారు. వీరందరినీ వెదికి పట్టడం ప్రభుత్వ యంత్రాంగానికి చాలా కష్టంగా మారింది.

నిజాముద్దీన్ సంఘటన వెలుగులోకి రానంత వరకు కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువుగా నగరాల్లోనే బయటపడ్డాయి. అయితే నిజాముద్దీన్ లింకులు పల్లెలకు కూడా పాకి వున్నాయి. మారుమూల ప్రాంతాల వాళ్ళు కూడా నిజాముద్దీన్‌కు వెళ్లి కరోనా అంటించుకుని వచ్చారు. వాళ్ళు తమ ప్రాంతాలలో తిరిగారు, వీళ్ళ ద్వారా వైరస్ ఎంతమందికి సోకిందో అర్థం కావడం లేదు. నిజాముద్దీన్ సంఘటనతో తెలుగు రాష్ట్రాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది.



కరోనా వైరస్‌పై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యుద్ధంలో మేమూ భాగస్వాములమవుతామంటూ... ఈ నెల 2వ తేదీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి రెండు కోట్ల రూపాయలు విరాళం అందజేస్తున్న శ్రీ సిటీ ఫౌండర్ & మేనేజింగ్ డైరెక్టర్ సన్నారెడ్డి రవీంద్ర, పక్కన ఎంపి విజయసాయిరెడ్డి.

# కరోనాపై యుద్ధంలో.. శ్రీసిటీ తోడ్పాటు

## • బాధితుల కోసం రెండు అంబులెన్సుల ఏర్పాటు



కరోనా మహమ్మారిపై పోరాటంలో భాగంగా బాధితుల అత్యవసర సేవల కోసం శ్రీసిటీ యాజమాన్యం తనవంతు సాయంగా సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు రెండు అంబులెన్సులను అందచేసింది. ఇప్పటికే సత్యవేడుకు ఓ వాహనాన్ని ఇచ్చేయగా, వరదయ్యపాళెంకు కేటాయించిన మరో అంబులెన్సును శ్రీసిటీ అగ్నిమాపక కేంద్రం ఆవరణ వద్ద మంగళవారం ఉదయం లాంఛనంగా సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా వరదయ్యపాళెం రెవిన్యూ ఇన్స్పెక్టర్ కు అందచేశారు. దీంతో పాటు శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ రెండు వేల మాస్కులను కరోనా బాధితుల కోసం ఎమ్మెల్యేకు అందచేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కరోనా బాధితుల అత్యవసర సేవల కోసం రెండు అంబులెన్సులు ఏర్పాటు చేసి, తన దాతృత్వాన్ని చాటుకున్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి ప్రత్యేక కృత్ఞతలు తెలిపారు. ఇదే కాకుండా మాస్కులు పంపిణీ, పొరుగు గ్రామాల్లో కరోనా అవగాహనా కార్యక్రమాలు, పారిశుధ్య చర్యలు, జాతీయ రహదారిలో ఆగిపోయిన సుమారు వంద లారీల సిబ్బందికి భోజన వసతులు కల్పించడం, దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఇక్కడకు పనులకు వచ్చి లాక్–డౌన్‌లో చిక్కుకుపోయిన 1800 మంది నిర్మాణ కార్మికులకు, మొబైల్ పరిశ్రమలో పనిచేస్తున్న మరో రెండువేల మంది మహిళా కార్మికులకు పరిశ్రమల యాజమాన్యాల సమన్వయంతో ఆశ్రయం, భోజన వసతులు కల్పించడం వంటి పలు సేవా కార్యక్రమాలు శ్రీసిటీ చేస్తోందని పేర్కొంటూ, యాజమాన్యాన్నిఅభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ సెక్యూరిటీ ఇంచార్జి రమేష్, శ్రీసిటీ సీఐ అశోక్ కుమార్, ఎస్సై అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసిటీ పారిశుధ్య చర్యలు..

శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసిటీ పారిశ్రామికవాడ పరిధిలోని కార్మికుల గృహ సముదాయాలు, వలస కార్మికుల నివాసాలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో ముమ్మరంగా పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఇప్పటికే శ్రీసిటీ పరిసర గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, కరోనా అవగాహనా కార్యక్రమాలు చేపట్టిన వీరు, ప్రస్తుతం పైవాటిపై దృష్టి సారించారు. శ్రీసిటీలో వివిధ ప్రాంతాల్లో సుమారు 1800 మంది వివిధ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులున్నారు. మల్లవారిపాలెం, చెరివి గ్రామాల వద్ద శ్రీసిటీ గృహ సముదాయాల్లోను మరికొంతమంది కార్మికులు నివ సిస్తున్నారు. కరోనా లాక్–డౌన్ తో వీరంతా నివాస షెడ్లు, గృహాలకే పరిమితమయ్యారు. శ్రీసిటీ మరియు ఆయా పరిశ్రమల యాజమాన్యాలు వీరందరికి భోజనం, ఇతర వసతులు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య చర్యలపై కూడా దృష్టిపెట్టి వారి నివాస ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు.



లాక్‌డౌన్ నేపథ్యంలో నెల్లూరు నగరంలో నిత్యావసర సరుకులు లేక ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు నిత్యావసర సరుకుల కిట్‌ను పంపిణీ చేస్తున్న మాగుంట శరత్ చంద్రారెడ్డి సేవాసమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు)

## కరోనా నివారణకు..

# విపిఆర్ దాతృత్వం

## - 75 లక్షలతో శానిటైజర్లు పంపిణీ



కరోనా మహమ్మారిని నిరోధించేందుకు తమవంతు పూర్తిస్థాయి సహాయసహకారాలుంటాయని, కరోనాను పారద్రోలడమే తమ లక్ష్యమని ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు.

గతనెల 31న నెల్లూరు రూరల్ మండలంలోని విపిఆర్ విద్యాలయంలో జిల్లావ్యాప్తంగా శానిటైజర్లను తీసుకెళ్ళే వాహనాలను మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 75లక్షల రూపాయల తమ సొంతనిధులతో జిల్లా వ్యాప్తంగా 1.5 లక్షల శానిటైజర్లను పంపిణీ చేయడమే తమ లక్ష్యమన్నారు. కరోనా నిరోధానికి భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కరోనా వ్యాధి వ్యాప్తిని నివారించేందుకు అందరూ సహకరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనలను పాటించాలని ఆయన కోరారు. ఈ సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను అభినందించారు. మంత్రి అనిల్ మాట్లాడుతూ, కరోనా నేపథ్యంలో ప్రజలు ఎంతో బాధ్యతతో మెలగాలని, ప్రజలు స్వీయ నిర్బంధం పాటిస్తే కరోనాను తరిమికొట్టడం సాధ్యపడుతుందని సూచించారు. రాష్ట్రంలో ఏ పేదవాడు ఆకలితో ఉండకూడదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, కరోనా నిరోధానికి వేమిరెడ్డి దంపతులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. వైఎస్సార్సీపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్, ఏసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



వివిధ ప్రాంతాలకు శానిటైజర్లను తీసుకువెళ్ళే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న విపిఆర్






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com